నినాదం
నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి
ఆదివారం 29-03-2026

## కాశీ క్షేత్రం...



సీ.
గంగమ్మ నిత్యము నిలకడ లేకుండ
ప్రవహించుచుండును ప్రతిదినమ్ము
పరమేశ్వరున కిట భస్మలేపనమున
నభిషేకమొనరించు నయ్యవారు
పొందుగాను పరాన్న భుక్తుని దర్శింప
వెనువెంటనె ఋణముల్ వీడిపోవు
అవనిపై వెలసి యష్టాదశ శక్తి పీ
ఠములలోన నిదియె ప్రముఖమయ్యె

తే.గీ.
రక్షణము నొసంగగ విశాలాక్షి యెపుడు
పేగు బంధమ్మటంచును ప్రేమ నింపు
సకల భక్త మోక్షప్రద స్థావరమ్ము
శివ కృపాలబ్ద వరము కాశీపురమ్ము.



జి.గోవర్ధన్, తెలుగు లెక్చరర్,
ఎం.వి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలెం,
మహబూబ్ నగర్ 509001
8106384812

## ఓర్పు-నేర్పు-సంతోషాల కూర్పు

నేర్చుకోవడం తెలుసుకుంటే
ఓర్చుకోవడం తెలుసుకుంటే
జీవితం లో సంతోషం అలవర్చుకోవడం తేలికే..
నేర్పు ఓర్పుతోనే సాధ్యం అనుకుంటే..
ఓర్పు యొక్క గమ్యం సంతోషాల తీరం..
కేవలం ఓర్పుని విస్మరించిన
యువత నేర్చుకొనుటలో వెనుక పడి,
సంతోషాలకు దూరం అవుతున్నారు
నేర్చుకోవడం లో సంతోషం ఉంది..
అంతులేని ఆనందం ఉంది..
మనం నేర్చుకుంటే..
నేర్చుకున్నది పదిమందికి పంచితే..
ఆ పది జీవితాలు ఆనందాలతో వెల్లి విరిస్తే..
తద్వారా కలిగిన ఆనందం..
కలిగిన అనుభూతి వర్ణనాతీతం..
ఈ ఆనందం అనుభూతి
కేవలం నేర్చుకోవడం లో..
నేర్చుకున్నది పదిమందికి
పంచడంలో మాత్రమే సాధ్యం..
ఈ అనుభూతి కేవలం
నేర్పు తోనే సాధ్యం..
ఈ నేర్పు ఓర్పు తోనే సాధ్యం..
ఓర్పుతో నేర్చుకుంటే..
సంతోషం అందరికీ సాధ్యం..

ఆరిశెట్టి రేవతీ గుప్తా,
సాలూరు
విజయనగరం జిల్లా
ఆంధ్ర ప్రదేశ్
ఫోన్: 8019127668.

## శ్రీరామతత్వం జగతికి ఆదర్శనీయం

భారతీయ సనాతన ధర్మానికి దిక్సూచి
హైందవ జాతికి అరుదైన దర్పణం
సకల ప్రాణకోటికి భక్తి పారవశ్యం
ధర్మ పరిరక్షణకు నిలువెత్తు నిదర్శనం
తల్లిదండ్రుల మాటకు విలువనిచ్చే
మహోన్నతమైన రూపం
నాయకత్వపు లక్షణాల క్షేత్రం
ప్రేమ పరమావధిగా, స్నేహం ధ్యేయంగా
నమ్మిన వర్గానికి న్యాయం చేసే ధైర్యం
చెడును సంహరించే గొప్ప ధీరత్వం
సుభిక్షమైన పరిపాలనకు ప్రతీక
అంతులేని కార్యదీక్షతకు చిరునామా
సర్వలోకాలను ఆదరించే గొప్ప గుణం
వసూదైక కుటుంబాలకు బాటలు వేసిన
వ్యక్తిత్వం భార్యాభర్తల ప్రేమ అనుబంధాలను
సృష్టికి తెలియజేసిన ఔదార్యం
లోకం పోకడలను వివరించిన
మానవీయ గ్రంథాలయం
అన్నదమ్ములకు భరోసానిచ్చే
బాధ్యతకు సంకేతం
సృష్టి మూలాలను సైతం
ఆశ్చర్యపరిచే చిహ్నం
సమస్త లోకాలను
ప్రభావితం చేసిన మహాకావ్యం



వంశీకృష్ణ గౌడ్ బండి
రంగయ్యపల్లి రేగొండ
జయశంకర్ భూపాలపల్లి జిల్లా
9550837962

# సలీం 'లోహముద్ర' అణగారిన జాతి అస్తిత్వఘోష

**తె**లుగు సాహిత్యంలో గిరిజన జీవన చిత్రణకు సుదీర్ఘ చరిత్ర ఉంది. అడవిని, అడవి బిడ్డల ఆత్మగౌరవాన్ని వస్తువుగా చేసుకుని అనేక రచనలు వచ్చాయి. అయితే, సమాజం ఒక జాతిపై వేసిన అప్రకటిత 'నేరస్థుల' ముద్రను, ఆ ముద్ర వెనుక ఉన్న చారిత్రక కుట్రను, ఆ సంకెళ్ళను తెంచుకుని ఎదిగిన వైనాన్ని పట్టి చూపిన నవలలు అరుదు. ఈ నేపథ్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత సలీం రాసిన 'లోహముద్ర' (2024) నవల ఒక చారిత్రక సామాజిక కోణంలో సామజిక అవసరంగా వచ్చింది. 'చదువు అన్వీక్షికి' ఉగాది నవలల పోటీలో బహుమతి పొందిన ఈ నవల, ఎరుకల తెగ రెండు శతాబ్దాల వేదనను, స్టువర్ట్‌పురం సెటిల్‌మెంట్ నేపథ్యంగా అద్భుతంగా చిత్రించింది.

ప్రకాశం జిల్లా త్రోవగుంటలో జన్మించిన సలీం, 'మానవత్వాన్ని మించిన మతం లేదు' అనే నినాదంతో తెలుగు సాహిత్యంలో తనదైన ముద్ర వేశారు. 1996లో 'స్వాతిచినుకులు'తో మొదలైన వీరి ప్రస్థానం.. 36 నవలలు, 12 కథా సంపుటాల వరకు విస్తరించింది. ముఖ్యంగా 'మెహర్', 'తలాక్' వంటి రచనల ద్వారా సామాజిక రుగ్మతలను ప్రశ్నిస్తూనే, 'కాలుతున్న పూలతోట' నవలకు 2010లో ప్రతిష్టాత్మక 'కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు'ను అందుకున్నారు. సంక్లిష్టమైన సమస్యలను సరళమైన శైలిలో, గుండెలకు హత్తుకునేలా చిత్రించే వీరి సాహిత్యం పలు భారతీయ భాషల్లోకి అనువదించబడడమే కాక, విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశంగానూ నిలిచింది. సమాజంలో మార్పును ఆశించే సలీం గారు, తన అక్షరాయుధంతో తెలుగు సాహిత్య వినీలాకాశంలో ధ్రువతారగా వెలుగుతున్నారు.

సలీం గారు రచించిన 'లోహముద్ర' నవల, ఒక మనిషిపై సమాజం వేసే చెరిపివేయలేని 'నేరస్థుడు' అనే ముద్ర ఆ వ్యక్తి భవిష్యత్తును ఏ విధంగా ఛిన్నాభిన్నం చేస్తుందో చర్చిస్తుంది. 19వ శతాబ్దపు చివరి నుండి 20వ శతాబ్దపు ఆరంభం వరకు 'ఎరుకల' తెగ ఎదుర్కొన్న 'క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్' (1871) పర్యవసానాలను ఈ నవల మూడు తరాల ప్రయాణంగా అద్భుతంగా ఆవిష్కరించింది. ఆకలి తీర్చుకోవడానికి చేసిన చిన్న దొంగతనాల వల్ల వ్యవస్థాకృత నేరస్థుడిగా ముద్రపడి, కానిస్టేబుల్ కోటయ్య వంటి వారి వేధింపులకు గురైన 'కర్రెద్దుల శీను' మొదటి తరానికి ప్రతినిధి అయితే.. సామాజిక వివక్ష వల్ల దారి తప్పి జైలు కెళ్ళి, ఆ తర్వాత పశ్చాత్తాపంతో గౌరవప్రదమైన జీవితం వైపు మళ్ళిన 'ప్రసాద్' రెండో తరానికి ప్రతీక. కానీ, వీరిద్దరి సంఘర్షణలకు సార్థకతనిస్తూ, పట్టుదలతో చదివి కలెక్టర్‌గా ఎదిగి తన జాతిపై ఉన్న 'దొంగ' అనే లోహముద్రను శాశ్వతంగా చెరిపివేసిన 'తిలక్' పాత్ర నవతరానికి దిక్సూచిగా నిలుస్తుంది. సాల్వేషన్ ఆర్మీ స్థాపించిన స్టువర్ట్ పురం సెటిల్మెంట్ నేపథ్యంగా సాగే ఈ కథలో, 1949లో 'క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్' రద్దు కావడం మరియు లవణం దంపతుల వంటి సంస్కర్తల కృషి వల్ల 1976లో ఆ ప్రాంతం 'స్వతంత్ర కాలనీ'గా గుర్తింపు పొందడం ఒక చారిత్రక విజయం. మనిషిని మార్చడానికి జైలు శిక్షల కంటే విద్య మరియు సామాజిక సంస్కరణలే గొప్ప ఆయుధాలని, అణచివేత నుండి ఆత్మగౌరవం వైపు సాగిన ఈ ప్రయాణం జాతి సామాజిక పరిణామ క్రమానికి ఈ మూడు పాత్రలు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయి.

**సామాజిక వివక్ష: కుల వ్యవస్థ సృష్టించిన అగాధాలు**


'లోహముద్ర' నవల భారతదేశంలోని వేళ్ళూనుకున్న సామాజిక వివక్షను, కుల వ్యవస్థ వల్ల కలిగే దుష్పరిణామాలను అత్యంత శక్తివంతంగా చిత్రించింది. డా.బి.ఆర్. అంబేద్కర్ గారు చెప్పినట్లు, కుల వ్యవస్థ సమాజాన్ని విడదీసి ఒక వర్గాన్ని మరో వర్గానికి దూరం చేసింది. నవలలో ఎరుకల వారిని "పుట్టుకతోనే దొంగలు, అబద్ధాల కోరులు" అని సమాజం ముద్ర వేయడం, వారి పట్ల ఉన్న క్రూరమైన వివక్షకు నిదర్శనం. ఉన్నత కులస్తులు భూమిపై తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి, నిమ్న వర్గాలైన ఎరుకలకు సాగుభూమి దక్కకుండా అడ్డుకోవడం వంటి అంశాలు ఆర్థిక అసమానతలకు మూలం కులమేనని స్పష్టం చేస్తాయి. మనుషులందరూ ప్రకృతి పరంగా సమానమైనప్పటికీ, ఈ సమాజం సృష్టించిన మౌఢ్యం వల్ల గిరిజనులు మానసిక వేదనకు, సామాజిక బహిష్కరణకు గురయ్యారు. మనుషుల మధ్య గోడలు కట్టడం కాకుండా, మానవత్వంతో కూడిన వంతెనలు నిర్మించడం ద్వారానే నిజమైన సామాజిక మార్పు సాధ్యమని సలీం ఈ నవల ద్వారా ప్రబోధించారు.

**క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్: ఒక జాతిపై వేసిన చెరిపివేయలేని ముద్ర**

భారతీయ సామాజిక చరిత్రలో బ్రిటీష్ ప్రభుత్వం అనుసరించిన అత్యంత క్రూరమైన విధానం '1871 నాటి నేరస్థుల తెగల చట్టం'. 'లోహముద్ర' నవలకు ఈ చట్టమే ప్రాణం. దీని ద్వారా సంచార తెగలను, ముఖ్యంగా ఎరుకల వంటి వారిని "పుట్టుకతోనే నేరస్థులు" (దీశీతీఅ జతీఱఎఱఅఱశ్రీం) అని ముద్రవేసి, వారిని కంచెలు వేసిన ప్రత్యేక నివాసాలకే (సెటిల్మెంట్‌లు) పరిమితం చేశారు. పోలీసుల అనుమతి లేనిదే కదలలేని స్థితి, ప్రతిరోజూ హాజరు వేయించుకోవాల్సిన అగత్యం వారిని తీవ్రమైన మానసిక వేదనకు గురిచేశాయి. ఈ చట్టం వల్ల కేవలం వ్యక్తులే కాదు, మొత్తం ఒక కులమే నేరస్థులుగా పరిగణించబడటం అమానవీయం. నవలలో శీను వంటి పాత్రల ద్వారా రచయిత సలీం.. చేయని నేరానికి శిక్ష అనుభవించడం, ఊరి బయట బతకడం వంటి ఆ జాతి ఎదుర్కొన్న చారిత్రక గాయాలను కళ్ళకు కట్టినట్లు చూపారు. స్వాతంత్ర్యం తర్వాత ఈ చట్టం రద్దయినా, సమాజం వేసిన ఆ 'లోహముద్ర' నేటికీ వారిని వెంటాడుతూనే ఉంది.

**అదృశ్య సంకెళ్లు: నవలలో బానిస వ్యవస్థ - సామాజిక వాస్తవికత**

'లోహముద్ర' నవల మానవ చరిత్రలోని అత్యంత క్రూరమైన బానిస వ్యవస్థను, గిరిజన జీవితాల నేపథ్యంలో బలంగా ఆవిష్కరించింది. ఒక వ్యక్తిని ఆస్తిగా భావించి హక్కులు లేకుండా చేసే ఈ అమానవీయ పోకడను జ్యోతిరావు పూలే, జాన్ లాక్ వంటి మహనీయుల ఆలోచనల వెలుగులో రచయిత విశ్లేషించారు. బ్రిటీష్ అధికారులు గిరిజనులకు మేలు చేయాలని తలపెట్టినా, అగ్రవర్ణాల వారు తమ భూస్వామ్య అధికారాన్ని కాపాడుకోవడానికి దాన్ని అడ్డుకోవడం ఈ నవలలో స్పష్టంగా కనిపిస్తుంది. గిరిజనులకు భూమి దక్కితే తమ వద్ద బానిసలుగా పని చేయరనే స్వార్థంతో సాగిన వివక్షను సలీం అత్యంత సహజంగా చిత్రించారు. నైజాం కాలం నాటి పటేల్, పట్వారీల కింద ఆజన్మ బానిసలుగా మగ్గిపోయిన ఎరుకల వారి దయనీయ స్థితి, ఒక జాతి సామాజికంగా ఎదగకుండా వ్యవస్థ ఏ విధంగా అడ్డుపడిందో ప్రతిబింబిస్తుంది. ఈ బానిసత్వపు సంకెళ్లను తెంచుకుని స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవడానికి ఆ జాతి చేసిన పోరాటాన్ని చాలా గొప్పగా చిత్రించారు.




**వ్యవస్థాకృత అణచివేత - సంస్కరణల వెలుగు: నవలలోని ఇతర ముఖ్యాంశాలు**

'లోహముద్ర' నవల కేవలం ఒక అంశానికే పరిమితం కాకుండా, గిరిజన జీవితాలను ఛిన్నాభిన్నం చేసిన అనేక సామాజిక సవాళ్లను లోతుగా చర్చించింది. 1878 నాటి 'అటవీ ఉత్పత్తుల నిషేధ చట్టం' అడవిపై ఆధారపడిన సంచార జాతుల జీవనాధారాన్ని దెబ్బతీసి, వారి జీవితాల్లో పెను విషాదాన్ని నింపింది. దీనికి తోడు పోలీసు దౌర్జన్యాలు, సామాజిక బహిష్కరణలు వారిని సాధారణ జీవితానికి మరింత దూరం చేశాయి. నవలలోని 'కోటయ్య' వంటి పాత్రలు నిరక్షరాస్యులైన ఎరుకులపై సాగించిన అమానుషమైన దాష్టికానికి, అధికార మదానికి నిలువుటద్దాలు. అయితే, ఇన్ని చీకట్ల మధ్య 'సాల్వేషన్ ఆర్మీ' వంటి సంస్థల కృషి, విద్యపై వారు చూపిన శ్రద్ధ ఆ జాతిలో కొత్త వెలుగులు నింపాయి. అణచివేతను ఎదిరించి, నిరక్షరాస్యతను వీడి, ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా 'తిలక్' వంటి పాత్రలు కలెక్టర్‌గా ఎదిగి, "దొంగలనే ముద్ర" నుండి గౌరవప్రదమైన ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని నిరూపించాయి.

సలీం రాసిన 'లోహముద్ర' నవల కేవలం ఒక కాల్పనిక కథ మాత్రమే కాదు, అది ఒక అణగారిన జాతి ఆత్మఘోష మరియు వారి ఆత్మగౌరవ పోరాటం. తెలుగు సాహిత్యంలో డా. కేశవరెడ్డి 'అతడు అడవిని జయించాడు' అరుణ 'ఎల్లి' శిరంశెట్టి కాంతారావు 'వాళ్ళు గెలవాలి' వంటి నవలల తర్వాత, ఎరుకల జీవితాన్ని ఇంతటి సామాజిక లోతుతో, వాస్తవిక ఆధారాలతో చిత్రించిన రచనలు చాలా అరుదు. సినిమా గ్లామర్ తగిలించిన 'స్టువర్ట్‌పురం' కథలకు భిన్నంగా, సలీం ఇక్కడి మనుషుల రక్తమాంసాలను, వారి కన్నీటి గాథలను మూడు తరాల ప్రయాణంగా మలిచారు. తాతల కాలం నాటి కులవృత్తి నుంచి, తండ్రి ఎదుర్కొన్న సామాజిక బహిష్కరణల దాకా ప్రయాణించి..నేడు విద్యావంతులై ఐ.ఏ.ఎస్. అధికారులుగా ఎదిగిన నవతరం విజయగాథ ఇది. "దొంగలనే ముద్ర" నుండి "గౌరవ ప్రదమైన పౌరులు"గా రూపాంతరం చెందిన ఈ విషాద, చైతన్య గాథను సలీం అద్భుతంగా నడిపారు. స్టువర్ట్‌పురం చరిత్రను, గిరిజన విముక్తి పోరాటాన్ని అర్థం చేసుకోవాలంటే ఈ నవలని చదవాల్సిందే. ఒక జాతి ఆత్మగౌరవాన్ని సాహిత్యపరంగా పునరుద్ధరించిన సలీం గారు నిజంగా అభినందనీయులు.



డా.జరుపుల రమేష్
అసోసియేట్ ప్రొఫెసర్,
తెలుగు విభాగం,
కాకతీయ ప్రభుత్వ కళాశాల, (స్వయం ప్రతిపత్తి), హనుమకొండ.
ఫోన్: 9618944654,

సీ.
ఆశ్రయించిన వారినాదరించెనతడు
కల్మషంబెరుగని కరుణమూర్తి
తగువులు పడకుండ దారినుంచెనతడు
ధర్మదేవతవంటి ధర్మ మూర్తి
ఆత్మగౌరవమన్న నాతడే చూపించె
అంబేద్కరునికాతడానుయాయి
ఊరినంతయు జాగృతముపరిచెనతడు
తనకందరొకటను ధన్యశీలి

తే.గీ:
గ్రామ పెద్దగానున్న నిగర్వియతడు
సంఘసంస్కరణకు తొలి సమరశీలి
అగ్రహారప్రజలకయ్యెనాప్తుడతడు
అతడె దార్లఅబ్బాయియే ధరణినందు!

తే.గీ:
గ్రామ పెద్దగానున్న నిగర్వియతడు
సంఘసంస్కరణకు తొలి సమరశీలి
అగ్రహారప్రజలకయ్యెనాప్తుడతడు
అతడె దార్లఅబ్బాయియే ధరణినందు!



కం.
కులమున కీర్తిని దెచ్చెను
బలముగ బిడ్డలను నిల్పి భాసుర గతిలో
నిలయము విద్యకు నగుచును
అలరెను గద దార్ల అబ్బయి ఘనుడుచూడన్

తే.గీ:
కష్ట పడియెను తానును గాలి వాన
నష్ట మోర్చియు బిడ్డల నడత దిద్ది
ఉన్నతోద్యోగులనుచేసెకన్నతండ్రి
ధరణిలో దార్ల అబ్బాయి ధన్య చరిత!



- డా.దార్ల వెంకటేశ్వరరావు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్.

## మహా వృక్షం నేలకొరిగితే... మనిషి మనుగడ ప్రశ్నార్థకమే!

**ఏ**దైనా సమతుల్యంగా, సమృద్ధిగా ఉన్నప్పుడు దాని గురించి ప్రస్తావించాల్సిన అవసరం లేదు. దేని కొరత అయితే ఏర్పడుతుందో దాని గురించే పదేపదే చర్చించుకోవాల్సి వస్తుంది. నేటి పర్యావరణ స్థితి కూడా అంతే. అది సమతుల్యంగా ఉన్నట్లయితే పర్యావరణానికి సంబంధించిన సాహిత్యం అంత విస్తృతంగా వచ్చి ఉండేది కాదు. ఒకప్పుడు రోడ్డుకి ఇరువైపులా ఉండే పచ్చని చెట్లు ఎండలోనూ, వానలోనూ దారినపోయే పాదచారుల అలసట తీర్చుకోవడానికి గొడుగులయ్యేవి. ఇప్పుడు పట్టణాలు, నగరాలలో ఎటు చూసినా విశాలమైన రోడ్లే తప్ప ఒక్క చెట్టూ కనిపించదు. పల్లెలు దీనికి మినహాయింపు ఏమీ కాదు. సమయం దొరికితే చాలు ఖాళీ స్థలాల్లో ఉన్న చెట్లను నరకడమే పనిగా పెట్టుకుంటున్నారు. ఈ విషయమే ఈ కింది కవితలో కనిపిస్తుంది.

**"మళ్లీ ఒక మహా వృక్షం నేలకొరిగింది/ దశాబ్దాల సుందర నిర్మాణం/నిర్దాక్షిణ్యంగా నిర్మూలించబడింది/ఎత్తిన గొడ్డలిలో కూడా/ఒక కర్ర దాగుంది/ తనను చంపడానికి కూడా తానే సహాయపడి..." (సోమిశెట్టి వేణుగోపాల్)**

పూర్వ కాలంలో వంట చేసుకోవడానికి కట్టెలను ఉపయోగించేవారు కాబట్టి చెట్లను నరకక తప్పేది కాదు. అయినా అప్పుడున్న జనాభా కంటే చెట్లే ఎక్కువగా ఉండేవి. మరి ఇప్పుడు పరిస్థితి అలా కాదు కదా! పెరుగుతున్న కాలుష్యాన్ని, జనాభాను దృష్టిలో పెట్టుకుంటే ప్రతి చెట్టూ విలువైనదే. ఈ సృష్టి జీవవైవిధ్యం కలిగి ఉండటంతో (ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉండటంతో), ఒకదాని కొరత దానిపై ఆధారపడిన ఇతర జీవులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వేసవికాలం అంటే గుర్తొచ్చేది మండుటెండలు. ఎండల నుండి సేద తీరడానికి వెతుక్కునే మార్గాలు చల్లని ప్రదేశాలు. సమ్మర్ వెకేషన్ కోసం ఎక్కడికెక్కడికో వెళ్లాలని ప్లాన్లు చేసుకుంటారు కానీ, తాము ఉన్న ప్రదేశంలోనే ఆ చల్లదనాన్ని సృష్టించుకోవడానికి ఎందుకు ఆలోచించరు? దాని కోసం ప్రత్యేకంగా ఏమీ చేయాల్సిన అవసరం లేదు; వాటి మానాన వాటిని వదిలేసినా ఈ సృష్టే వాటికి కావలసిన సూర్యరశ్మిని, వానను, మంచును ఇచ్చి బతికిస్తుంది. నేడు అభివృద్ధి పేరుతో ప్రకృతిని నాశనం చేస్తున్నారు. ఒకప్పుడు ప్రకృతికి ఆకర్షితులైన కవులు, ఇప్పుడు ఆవేదనతో దాన్ని పరిరక్షించే దిశగా కవిత్వం రాస్తున్నారు అంటే ప్రకృతి, పర్యావరణం ఎంతగా దెబ్బతిందో గుర్తించవచ్చు.

**"చెట్లే ప్రగతికి తొలి మెట్లు/ చెట్లే జగతికి పనిముట్లు అందుకే వాటిని పెంచాలి/ ఆనందాలను పంచాలి" (వడ్డేపల్లి కృష్ణ)** నేటి కాలంలో మనిషికి ఓర్పు నశించింది, స్వార్థం పెరి గింది. దీనితో మనుషులకు చెట్లు భారమైపోయాయి. ఖాళీ స్థలాల్లో అవి పెరుగుతుంటే ఏదో విష పదార్థం మొలి చిన ట్లుగా భావించి వాటి అంతం చూసేవరకూ నిద్రపోరు. వాకిలిలో నాలుగు ఆకులు రాలుతున్నాయనే సాకుతో కూడా చెట్లను నరుకుతున్నారు. వాటికీ ప్రాణం ఉందని గ్రహించగలిగితే పచ్చని చెట్టును నరకడానికి మనసు ఒప్పదేమో! ఈ ఆవేదనంతా కవులు తమ కవిత్వంలో ఇలా వెల్లడించారు:

**"చెట్టునురా - చెలిమినిరా!/ తనువునురా - తల్లినిరా! నరికి వేయబోకురా/ కరువు కోరుకోకురా!/ అమ్మనురా! అమ్మ కూడా!/ కొడుకునురా! నన్ను కొట్టకురా!"/ (సుద్దాల అశోక్ తేజ)**

**కాస్ట్లీ ఆక్సిజన్:** స్వార్థం లేకుండా మనకు పువ్వులు, కాయలు, చల్లదనాన్ని ఇచ్చే చెట్టును నరకడం అంటే అన్నం పెట్టిన చేతిని నరకడం లాంటిదే. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా 24 గంటలూ ఆక్సిజన్ ఇచ్చే అద్భుతమైన చెట్లు వేప, రావి, మర్రి, జమ్మి, మద్ది, కానుగ వంటివి. అలాగే తులసి, కలబంద, మనీ ప్లాంట్ వంటి చిన్నపాటి మొక్కలు కూడా ఎంతో మేలు చేస్తాయి. వాటన్నిటినీ వదిలి వందలు, వేలు ఖర్చు చేసి ఇండోర్ ప్లాంట్లు (అంథూరియం, స్పైడర్ ప్లాంట్, స్నేక్ ప్లాంట్, పీస్ లిల్లీ, లక్కీ బాంబూ ప్లాంట్, రబ్బరు ప్లాంట్) తెచ్చుకుని మురిసిపోతుంటారు. ఎందుకంటే వాటికి మట్టితో పని లేదు, రోజూ నీరు పోయాల్సిన అవసరం లేదు. మనుషులు తమ బిజీ లైఫ్‌కు అనుగుణమైన మొక్కల్నే ఎంచుకుంటున్నారు. అవి కూడా మంచివే కానీ, వేసవిలో చల్లటి గాలినిచ్చి, కాలుష్యాన్ని తగ్గించి, భూగర్భ జలాలను పెంచి, పక్షులకు, జీవులకు ఆశ్రయం కల్పించే వందల ఏళ్ల నాటి మహావృక్షాలను నరికి, వాటి స్థానంలో మూరెడు పొడవున్న మొక్కల్ని పెంచుతూ పర్యావరణాన్ని కాపాడుతున్నామనుకోవడం అవివేకం. ఎన్ని వందల మొక్కలైనా ఒక పెద్ద చెట్టుతో సమానం కాగలవా? ఎక్కడైతే నీరు,చెట్లు ఉంటాయో ఆ ప్రదేశం చల్లగా, ఆహ్లాదంగా ఉంటుంది. చంద్రుని చల్లదనాన్ని ఇష్టపడని వారు ఉండరు.ఎండను చూసి భయపడని వారూ ఉండరు...ఆ ఎండ వేడిని పెంచేది,వెన్నెల చల్లదనాన్ని తగ్గించేది మన కొద్దిపాటి నిర్లక్ష్యమే అని ఎందరు గుర్తించగలుగుతున్నారు...?

నేటి కాలంలో క్యాన్సర్ వంటి వ్యాధులు పెరగడానికి వాతావరణ మార్పులు కూడా ఒక కారణం అయితే. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ఋతుపవనాలు అస్తవ్యస్తమై, అతివృష్టి లేదా అనావృష్టి ఏర్పడుతోంది. దీనివల్ల పంటలు దెబ్బతిని, ఆహార కొరత ఏర్పడుతోంది. ఆ కొరతను అధిగమించడానికి రసాయనాలను విపరీతంగా వాడటం వల్ల కూడా క్యాన్సర్లు వస్తున్నాయి.

**ప్రకృతి పండుగలు:**

మన సంస్కృతిలో పత్రం, పుష్పం, ఫలం భాగమైపోయాయి. రావి చెట్ల కింద రచ్చబండలు వేయడం, తులసి మొక్కకు ప్రదక్షిణలు చేయడం వెనుక శాస్త్రీయ కారణాలు ఉన్నాయి. అవి గాలిని శుద్ధి చేసి, రోగనిరోధక శక్తిని పెంచి, మానసిక ప్రశాంతతను ఇస్తాయి. మన పండుగలైన సంక్రాంతి, బతుకమ్మ, ఉగాది, ఓనమ్ వంటివన్నీ ప్రకృతితో ముడిపడి ఉన్నవే. ఇవి ఏ ఒక్క కులానికో, మతానికో సంబంధించినవి కావు; ఇవి పచ్చని పర్యావరణ పండుగలు. **"జీవిత లక్ష్యాన్ని గూర్చి చెట్టేమని అంటుంది?/ ప్రతిఫలమును ఆశించక/ ఫలములీయమంటుంది./ ఎండలోన తానుండి నీడ నీకు ఇస్తుంది/ వానలోన తాను తడిసి గొడుగు నీకు పడుతుంది." (ఉండేలా మాల కొండారెడ్డి)** మనకు కావలసిన ఆహారం, ఔషధాలు, ప్రాణవాయువు అన్నీ ఇచ్చే చెట్ల కోసం మనం కొంత సమయం వెచ్చించినట్లయితే, అవి మన జీవితాలను పచ్చదనంతో నింపుతాయి. మనిషి స్వార్థపు జీవిగా మారి తనకి ఏ చిన్న అడ్డు వచ్చినా ప్రకృతిని నాశనం చేయడం మానుకోవాలి.



-మోటూరి హిమబిందు,
రీసెర్చ్ స్కాలర్, తెలుగు శాఖ,
సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్

## డెయిలీ వర్రీ బాయ్స్


కడుపు కోతను మించిన పురిటినొప్పుల యాతన అది
సమయంతో చేసే నిరంతర యుద్ధం అది!
వాకిలి ముందు నిలిచే వస్తువు వెనుక..
వాకిలి దాటలేని ఒక సామాన్యుడి కన్నీటి గాథ ఉంది.
గిగ్.. బిన్.. కొత్త మాటలు కావు అవి
వారి ఆకలిని శాసించే అక్షయ పాత్రలు!
ఆ పిలుపు కోసం వెయ్యి కళ్లతో నిరీక్షణ
ట్రాఫిక్ సుడిగుండంలో ప్రాణాలను
పణంగా పెట్టిన ప్రయాణం.
ప్యాకర్ మర్చిపోయిన ఒక వస్తువు..
కస్టమర్ విసిరే ఒక్క సూటిపోటి మాట..
స్టోర్ చేసిన చిన్న పొరపాటుకు – శిక్ష అనుభవించేది వారే!
ఒక్క ఐటెం మిస్ అయినా, ఒక్క బాక్స్ డ్యామేజ్ అయినా
ఆ భారమంతా మోసేది వారి చిక్కిన చేతులే.
టార్గెట్ రీచ్ కాకపోతే ఇన్సెంటివ్స్ లేవు
ఇన్సెంటివ్స్ లేకపోతే ఇంట్లో పొయ్యి వెలగదు.
రోజంతా కస్టమర్ల ఆకలి తీర్చి..
రాత్రికి ఆకలితో కళ్లు వాచి
నిద్రపోయే జీవులవి.
అందుకే..
వారు కేవలం వస్తువులను చేరవేసే
డెలివరీ బాయ్స్ కాదు
అనుక్షణం ఆందోళనలతో బతికే
'డెయిలీ వర్రీస్' బాయ్స్!



బ్యాగరి అంజి, అత్వెల్లి.
99492 11150

## కలం ఆగిపోదు

నా కలం ఆగిపోదు
నా గళం మూగపోదు
పసి పడతుల బదుకులు
వసి వాడి చెడిన నాడు
కులం, కులమని సంఘంలో
వ్యాకులం జనించిన నాడు
మతం పేరున అభి
మతం అణగార్చిన నాడు
అంటరాని వాని వని
వాని గెంటివేసిన నాడు
ఓటుకొరకు పోటీబడి
ఓటి బాస ఒసగిన నాడు
ప్రజాస్వామ్య వ్యవస్థనే
పంకిల మొనరించిన నాడు
దేవుడి పేరు చెప్పి, దేశమంతా
దేవురించిన నాడు
కూలీలకు తూట్లుపొడిచి
కోట్లకు పడగెత్తిన నాడు
లేనిపోని మిషలు చూపి
లేవడి చేసిన నాడు
నా కలం ఆగిపోదు
నా గళం మూగపోదు



- ప్రతాప్
రాజులపల్లి
97698 55645

సినాదం
నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి
ఆదివారం 29-03-2026

### జననం-విద్యాభ్యాసం...

నందిని సిధారెడ్డి 1955 జూన్ 12న తెలంగాణ రాష్ట్రంలోని సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలో బందారం గ్రామంలో జన్మించారు. 2017-మే 2 నుంచి 2020 మే వరకు తొలి తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ గా పని చేశారు. ఆయన తండ్రి నర్ర బాల సిధారెడ్డి నిజాం పాలనలో రజాకారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన ఉద్యమకారుడు. ఆ కుటుంబంలోనే ఉన్న అంతర్గత సామాజిక చైతన్యం, ప్రజల పట్ల ఉన్న బాధ్యతా భావం సిధారెడ్డి ఆలోచనలపై గాఢమైన ప్రభావం చూపింది. చిన్ననాటి నుంచే సాహిత్యం, సామాజిక ప్రశ్నల పట్ల ఆసక్తి కలిగిన ఆయన విద్యార్థి దశలోనే కవిత్వం రాయడం ప్రారంభించారు. ఆయన హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీ లో తెలుగు సాహిత్యంలో ఎం.ఏ. పూర్తి చేశారు. తరువాత ఆధునిక తెలుగు కవిత్వంపై ఎం.ఫిల్, అనంతరం పీహెచ్.డి చేశారు. ఆధునిక తెలుగు కవిత్వంలోని వాస్తవికత, అధివాస్తవికత అంశంపై ఆయన చేసిన పరిశోధన సాహిత్య విమర్శకులలో ప్రాధాన్యత పొందింది. చిన్ననాటి నుంచే తెలుగు భాషపై, కవిత్వంపై ఆయనకు అపారమైన ఆసక్తి ఉండేది. గ్రామీణ జీవన వాతావరణంలో పెరిగిన ఆయన, ప్రజల జీవితాన్ని, వారి కష్టసుఖాలను, సంప్రదాయాలను, సంస్కృతిని లోతుగా అర్థం చేసుకున్నారు. ఈ అనుభవాలే తరువాత ఆయన రచనలకు మూలాధారమయ్యాయి.

### సాహిత్య ప్రస్థానం....

డా. నందిని సిద్ధారెడ్డి గారి సాహిత్య ప్రస్థానం ఎంతో విశిష్టమైనది. కవిత్వం, వ్యాసరచన, ప్రసంగాలు, పరిశోధనా రచనలు, సాహిత్య చర్చలు వంటి అనేక రంగాల్లో ఆయన కృషి చేశారు. తెలంగాణ ప్రజల భాషలో, వారి ఊరి పలుకుబడిలో, వారి భావోద్వేగాల్లో సాహిత్యాన్ని సృష్టించడం ఆయన ప్రత్యేకత. తెలుగు సాహిత్యంలో సాధారణంగా కనిపించే పాండిత్యభరితమైన శైలికి భిన్నంగా, ప్రజల మాటలను, తెలంగాణ నేల వాసనను, జీవన వాస్తవాలను ఆయన తన కవిత్వంలో ప్రతిబింబిస్తాయి. ప్రకృతి, పల్లెజీవితం, రైతు బాధలు, సామాజిక అసమానతలు, అన్యాయం, మనిషి ఆత్మగౌరవం, ప్రాంతీయ సంస్కృతి వంటి అంశాలు విస్తృతంగా కనిపిస్తాయి. ఈ కారణంగా ఆయన రచన లు పాఠకులకు దగ్గరయ్యాయి. సాధారణ ప్రజల హృదయాలను తాకే భాషలో రాసిన కవిత్వం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది.

తెలుగు సాహిత్య ప్రపంచంలో తెలంగాణ మట్టి వాసనను, ప్రజల జీవన అనుభవాలను, భాషా మాధుర్యాన్ని తన రచనల ద్వారా మన ముందుకు తీసుకువచ్చిన ప్రముఖ కవి, రచయిత, సాహితీవేత్త డా. నందిని సిద్ధారెడ్డి పేరు చెప్పగానే 'నాగేటి సల్లలో నా తెలంగాణ' గుర్తుకొస్తుంది. వీటితోపాటు భూమి స్వప్నం, సంభాషణ, ప్రాణహిత, ఇక్కడి చెట్లగాలి, జోహార్లు జోహార్లు, తెలంగాణ మట్టి మొదలేనివన్నీ కవిత్వానికి సంబంధించినవి. అవర్తనం, ఇగురం (తెలంగాణ భాష, సంస్కృతిపై వ్యాసాలు) ఆయన రాసిన వ్యాసాలు. తెలంగాణ సాహిత్యానికి, ముఖ్యంగా ప్రజా భావజాలానికి దగ్గరగా ఉండే కవిత్వాన్ని ఆయన అందించారు. ఆయన రచనలు కేవలం సాహిత్య ప్రక్రియలుగా మాత్రమే కాకుండా సమాజానికి అద్దం పట్టే పాఠాలుగా నిలిచాయి. తెలంగాణ ప్రాంతపు సంస్కృతి, భాష, భావోద్వేగాలు, చరిత్రను ఆయన తన కలంతో ఎంతో సజీవంగా చిత్రించారు.



# ప్రజల బాధలకు... కవిత్వ ప్రతిధ్వని

# అనిమేష

### తెలంగాణ భాషా గౌరవానికి చేసిన సేవ:-

డా. నందిని సిద్ధారెడ్డి గారి పేరు వినగానే ముందుగా గుర్తుకు వచ్చేది తెలంగాణ భాషా గౌరవం. చాలా కాలం పాటు తెలంగాణ పలుకుబడి, తెలంగాణ భాషను కొంతమంది తక్కువగా చూసిన పరిస్థితులు ఉన్నాయి. అలాంటి సమయంలో తెలంగాణ భాషలోని మాధుర్యాన్ని, ఆ భాషలోని సాహిత్య సామర్థ్యాన్ని ఆయన బలంగా చాటిచెప్పారు. తెలంగాణ భాష కూడా సమృద్ధిగా ఉన్న సాహిత్య భాషేనని ఆయన తన రచనల ద్వారా నిరూపించారు. ఆయన కవిత్వం వల్ల తెలంగాణ ప్రజలు తమ భాష పట్ల గర్వపడేలా అయ్యారు. తెలంగాణ భాషలో మాట్లాడటం, రాయడం, పాడటం అన్నీ గౌరవప్రదమైనవే అని ఆయన సాహిత్యం సమాజానికి తెలియజేసింది. ఈ విధంగా ఆయన భాషా చైతన్యానికి మార్గదర్శకుడయ్యారు. డా. నందిని సిద్ధారెడ్డి గారు కేవలం కవి మాత్రమే కాదు సమాజాన్ని గమనించే చైతన్యవంతుడు. రైతు సమస్యలు, పేదల కష్టాలు, అసమానతలు, సామాజిక అన్యాయాలు, ప్రాంతీయ ఆత్మగౌరవం వంటి అంశాలపై ఆయనకు స్పష్టమైన దృక్పథం ఉంది. ఈ అంశాలు ఆయన రచనల్లో స్పష్టంగా ప్రతిఫలిస్తాయి. కవి సమాజానికి దూరంగా ఉండకూడదని, ప్రజల బాధలు తెలుసు కొని వాటిని సాహిత్యంగా మలచాలని ఆయన నమ్మకం.

### తెలంగాణ సంస్కృతికి ప్రతినిధి...

తెలంగాణ సంస్కృతి అనేది కేవలం భాష మాత్రమే కాదు; ఆచారాలు, పండుగలు, పాటలు, సంప్రదాయాలు, బతుకమ్మ, బోనాలు, పల్లెజీవితం, జానపద భావజాలం అన్నీ కలిసిన సమగ్ర జీవన విధానం. ఈ సంపదను డా. నందిని సిద్ధారెడ్డి తన రచనల్లో సజీవంగా నిలబెట్టారు. అందువల్ల ఆయన రచనలు చదివితే తెలంగాణ సంస్కృతి యొక్క అంతరంగాన్ని తెలుసుకోవచ్చు. డా. నందిని సిద్ధారెడ్డి ఉపాధ్యాయునిగా కూడా విశేష సేవలు అందించారు. విద్యార్థుల్లో తెలుగు భాషపై ప్రేమను, సాహిత్యంపై ఆసక్తిని పెంపొందించారు. మంచి వక్తగా అనేక సభల్లో ప్రసంగించి తెలుగు భాషా గొప్పతనాన్ని, తెలంగాణ సాహిత్య విశిష్టతను ప్రజలకు తెలియజేశారు. ఆయన మాటల్లో సరళత, లోతు, ప్రభావం ఉంటాయి. అందువల్ల ఆయన ప్రసంగాలు కూడా సాహిత్య చైతన్యాన్ని కలిగించేవిగా నిలిచాయి.

సాయి 5
సాహిత్య ముచ్చట్లు

### సాహిత్యానికి ఆయన చేసిన సేవలు...


డా. నందిని సిద్ధారెడ్డి తెలుగు సాహిత్యానికి అనేక విధాలుగా సేవ చేశారు. అంతేకాదు కవిత్వం ద్వారా ప్రజల హృదయాలను తాకారు. తెలంగాణ భాషకు గౌరవం తెచ్చిన గొప్పవ్యక్తి ప్రాంతీయ సంస్కృతిని సాహిత్యంలో నిలబెట్టి యువ రచయితలకు స్ఫూర్తిగా నిలిచారు. పరిశోధనాత్మక దృక్పథంతో సాహిత్యాన్ని విశ్లేషించి సాహిత్య సభలు, చర్చలు, ప్రసంగాల ద్వారా తెలుగు భాష ప్రచారానికి కృషి చేశారు. యువతకు స్ఫూర్తి ఈ రోజుల్లో యువత ఎక్కువగా ఇతర భాషల వైపు మొగ్గుచూపుతున్న సమయంలో, తమ మాతృభాష పట్ల గౌరవం కలిగి ఉండాలని డా. నందిని సిద్ధారెడ్డి గారి జీవితం మనకు చెబుతుంది. ప్రాంతీయ భాషలోనూ గొప్ప సాహిత్యం సృష్టించవచ్చని ఆయన నిరూపించారు. తన నేల, తన భాష, తన ప్రజల పట్ల ప్రేమ ఉంటే రచనలకు చిరస్థాయితనం వస్తుందని ఆయన జీవితం తెలియజేస్తుంది. అందువల్ల యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి.ప్రకృతి, మానవుల సంఘర్షణ, ఐక్యం, సమన్వయం 'అనిమేష'. రెప్పవాల్చనిది - అనుక్షణ జాగరూక నిద్ర, మృత్యువు ఎరుగనిది ఒక భావోద్వేగం, విలోకనం, వివేచనం. మనిషిలోకి, ప్రకృతిలోకి, ప్రపంచంలోకి, స్వభావంలోకి, కాలంలోకి... లోచూపు, చుట్టు చూపు, తడి చూపు, వేడి ఊర్పు, నిట్టూర్పు. లోపలికి, లో పలికి ఉబికిన దీర్ఘశ్రుతి... ఈ కావ్యం. అని అంటారు.

**సాహిత్యంలో సిధారెడ్డి గారు ఒక విశిష్టమైన ముద్ర కలిగిన కవి. ప్రాదేశిక అస్తిత్వాన్ని, సామాజిక స్పృహను తన కవిత్వంలో మేళవించడంలో ఆయన సిద్ధహస్తులు. 'అనిమేష - ఉపద్రవగాథ' అనే ఈ కావ్యం ముఖ్యంగా కోవిడ్-19 మహమ్మారి కాలంలో సమాజం ఎదుర్కొన్న అల్లకల్లోలాన్ని, మనుషుల మధ్య పెరిగిన దూరాన్ని, వ్యవస్థల వైఫల్యాన్ని ఎండగడుతుంది. 'అనిమేష' అంటే రెప్పవాల్చనిది అని అర్థం. అంటే ఈ ఉపద్రవం కళ్ళముందే జరుగుతుంటే, కవి ఒక సాక్షిగా రెప్పవాల్చకుండా గమనించి రాసిన గాథ ఇది. కరోనా గడ్డు పరిస్థితిల మీద ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని దేశాల నుండి కవిత్వం వచ్చింది, అనేకమంది కవుల కవిత్వాన్ని కూర్చిన అనేక సంకలనాలు వచ్చాయి. కానీ వ్యక్తిగత కవితా సంపుటాలు తక్కువగానే వచ్చాయి. కోవిడ్ కాలాన్ని, బాధని, దుఃఖాన్ని కవిత్వం చేసిన నందిని సిధారెడ్డి గారి 'అనిమేష కవిత్వ సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించడం తెలంగాణ కవిత్వానికి దక్కిన గొప్ప గౌరవం.**

> **ఈ కావ్యం ప్రధానంగా ఒక 'ఉపద్రవ కాలం' చుట్టూ తిరుగుతుంది. ప్రపంచమంతా స్తంభించిపోయిన వేళ, ప్రాణ భయంతో మనుషులు ఇళ్లకే పరిమితమైనప్పుడు జరిగిన విషాదాలను కవి ఇందులో చిత్రించారు. వలస కూలీల ఆక్రందనలు, ఆసుపత్రుల ముందు అంబులెన్స్‌ల సవ్వడులు, స్మశానాల్లో పెరిగిన రద్దీ--వీటన్నింటినీ కవి అత్యంత హృదయవిదారకంగా వర్ణించారు.**

కవి పాదాలను ఒక శక్తివంతమైన సంకేతంగా వాడారు. ఆ పాదాలు కేవలం నడకకు సాధనాలు కావు, అవి ఆకలికి, అలసటకు, వ్యవస్థల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యాలు. "పాదాల కింద భూమి కదులుతోంది కానీ, గమ్యం చేరడం లేదు" అన్న భావన వారి నిస్సహాయతను తెలుపుతుంది. లాక్‌డౌన్ సమయంలో వేల కిలోమీటర్లు నడిచి వెళ్ళిన వలస కూలీల కష్టాలను కవి అనేక కవితల్లో ప్రస్తావించారు. మండుటెండలో, కాలికి చెప్పులు లేకుండా రైలు పట్టాల వెంట సాగిన వారి ప్రయాణం ఆధునిక నాగరికతపై ఒక మచ్చగా కవి భావిస్తారు. లాక్‌డౌన్ ప్రకటించిన తక్షణమే ఉపాధి కోల్పోయి, రవాణా సౌకర్యాలు లేక వేల మైళ్ల దూరాన్ని కాలినడకన బయలుదేరిన వలస జీవుల కష్టమే ఈ కవితకు ప్రాణం. నందిని సిధారెడ్డి గారు ఈ కవితలో మనిషి మనుగడ కోసం చేసే పోరాటాన్ని సామాజిక కోణంలో విశ్లేషిం చారు. "దేశం నడుస్తోంది.. పాదాల మీద కాదు, రక్తపు చారల మీద" - అనే భావన ఈ కవితల్లో స్పష్టంగా కనిపి స్తుంది. ***"సరిహద్దు మీద ఎగిరిన పక్షి చూపు/కాసిన చెట్టుమీదే/రాశులు రాశులుగా కూడే భాషను/తూర్పార పట్టే వాళ్లేరీ/ అర్థాలు కొమ్ములు మొలిచి అటకాయిస్తే/దు:ఖాలకేది దిక్కు/వాదాలకేమి/తగాదాలకేమి/వీసాలకేమి/చట్టాలు చేసుకున్నవే/ రాజ్యాంగం రాసుకున్నదే/బతుకు పాటను మోసుకతిరిగే/గాలి మణికట్టు మీద/ఇమిగ్రేషన్ ముద్ర వేసేదెవరు"***... అంటారు.

**క్యాసీ జిందగీ హై**
**క్యా హాలత్ హమారా**
**ఎక్కడి బీహార్**
**ఎక్కడి డిల్లీ కొడుకు**
**బతుకుతాడంటే**
**కొంప అమ్ముకొని**
**తీసుకొచ్చినం**
**కాలమే పగబట్టిందో**
**దేవుడే పగబట్టిండో**
**తగని రోగం తలిగింది**
**కండ్ల ముందే**
**కన్నకొడుకు**
**ఒడి తిరిగిపోతుంటే**
**చూడలేముగదయ్యా**
**కాటికి కాళ్ళు చాపిన**
**మమ్ముల తీస్క**
**పోకుండా**
**పొద్దు పొడిసిన**
**కాడున్న పోరనికి**
**ఆ రాత రాసిన దేవుడేం**
**దేవుడు**
**సక్కదనాల కొడుకు**
**పానం పోసి పెంచినం**
**నోటినిండ**
**పేగు కదిలెటట్టు పిలిసేది**
**మా బ్రమలన్ని వాడే....**




### ఒంటరితనం -మృత్యు భయం...

కరోనా కాలంలో మనిషికి మనిషి దూరమవ్వడం అతిపెద్ద విషాదం. సొంత మనుషులు చనిపోయినా కడసారి చూపుకు నోచుకోని దైన్యాన్ని కవి 'అనిమేష'లో బలంగా చిత్రించారు. మరణం ఒక గణాంక ప్రాయంగా మారిపోయిన వైనాన్ని చూసి కవి హృదయం ద్రవించింది. మనిషి ప్రకృతిని జయించానని అహం కరిస్తున్న వేళ, ఒక కంటికి కనిపించని వైరస్ ప్రపంచాన్ని ఎలా గడగడలాడించిందో కవి తాత్విక కోణంలో విశ్లేషించారు. ప్రకృతి తనను తాను శుద్ధి చేసుకుంటున్న ప్రక్రియను, మానవుడు తన జీవన విధానాన్ని పునరాలోచించుకోవాల్సిన అవసరాన్ని ఈ కవి తలు నొక్కి చెబుతాయి. నందిని సిధారెడ్డి గారు కేవలం భావోద్వే గాలకే పరిమితం కాకుండా, వ్యవస్థల వైఫల్యాన్ని కూడా ప్రశ్నిం చారు. ఆక్సిజన్ లేక ప్రాణాలు వదిలిన సామాన్యులు, ఖరీదైన వైద్యం అందక రోడ్డున పడ్డ కుటుంబాల స్థితిగతులను చూసి ఆయన కవిత్వం ఆక్రోశించింది. అధికారం, సంపద మనిషి ప్రాణాన్ని కాపాడలేవని, సామాజిక బాధ్యత మాత్రమే ముఖ్యమని ఆయన హెచ్చరిస్తారు. *"ఎట్ల పుట్టిందో/ఎవడు పెట్టిందో/ వినిపిం చదాయె కనిపించదాయె/ఇంత పెద్ద మనిషిని/ఇంత విశాల ప్రపంచాన్ని/ ఇంత కలవర పెడుతుంది/ఇన్ని వ్యవస్థలు/ ఇన్ని అధికారాలు/ ఇన్ని శాస్త్రాలు/ తెల్లబోయాయి"* రైలు పట్టాల మీద అలసిపోయి నిద్రపోయిన కూలీలు, వారిపై నుండి రైలు వెళ్లిన ఉదంతాన్ని కవి అత్యంత వేదనతో గుర్తు చేస్తారు. ఇక్కడ "రైలు పట్టా" అనేది ఆధునికతకు చిహ్నం అయితే, దానిపై చిందిన రక్తం పేదవాడి బతుకు చిత్రానికి నిదర్శనం. నగరాలను నిర్మించిన చేతులే, ఆ నగరాల నుండి వెలివేయబడటం ఈ కవితలోని ప్రధాన వైరుధ్యం. భవంతులు కట్టిన మేస్త్రీలు, రోడ్లు వేసిన కూలీలు అదే రోడ్ల మీద అనాథల్లా నడవడం నాగరిక సమాజపు నైతిక పతనాన్ని సూచిస్తుందని కవి నిలదీస్తారు. సిధారెడ్డి గారి భాషలో ఒక రకమైన 'ఆర్తి' ఉంటుంది. ఆయన వాడిన పదాలు-ఎండమావులు, నెత్తుటి అడుగులు, గమ్యం లేని ప్రయాణం-పాఠకుడిని ఆ దృశ్యానికి సాక్షిగా నిలబెడతాయి. అలంకారిక భాష కంటే, వాస్తవికతకు దగ్గరగా ఉండే వచన కవిత్వం ఇక్కడ పాఠకుడిని నేరుగా తాకుతుంది. ఈ కవిత కేవలం ఒక సంఘటనను వివరించదు. ఇది మనిషికి, మట్టికి ఉన్న సంబంధాన్ని.. ఆపత్కాలంలో మనిషి తన సొంత గూటికి (గ్రామానికి) వెళ్లాలని తపించే 'మూలాల అన్వేషణ'ను ప్రతిబింబిస్తుంది. ఎంత పెద్ద ఉపద్రవం వచ్చినా, మనిషి తన ఆత్మవిశ్వాసంతో, పాదాల బలంతోనే దానిని అధిగమించగలడని కవి పరోక్షంగా సూచిస్తారు.

### నిశ్శబ్దం - ఒక ఆర్తనాదం...

ఆసుపత్రి బయట అంబులెన్స్‌ల సైరన్ మోతలను కవి 'మృత్యువు పిలుపు'గా అభివర్ణించారు. లోపల వెలుగు తున్న ఐ.సి.యు (ICU) లైట్లు, బయట ఆందో ళనతో వేచి చూస్తున్న బంధువుల కళ్ళలోని 'అనిమేష' (రెప్పవా ల్చని తనం) ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. "మనం పీల్చే గాలి మనది కాకుండా పోయింది" అని కవి అనడంలో గొప్ప తాత్వికత ఉంది. అభివృద్ధి పేరుతో ప్రకృతిని నాశ నం చేసిన మనిషి, ఇప్పుడు అదే ప్రకృతి ఇచ్చే ప్రాణవా యువు కోసం క్యూలైన్లలో నిలబడటం ఒక చారిత్రక విషాదం. లాక్‌డౌన్ సమయంలో వీధులన్నీ ఖాళీ అయి పోయి, నగరం ఒక స్మశాన నిశ్శబ్దాన్ని తలపించిన వైనాన్ని కవి ఈ విభాగంలో చిత్రించారు. సాధారణంగా నిశ్శబ్దం ప్రశాంతతకు చిహ్నం. కానీ ఈ కావ్యం ప్రకారం, ఆ నిశ్శబ్దం భయానకమైనది. **"గోడలు మాట్లాడుతున్నాయి.. మనుషులు మౌనంగా ఉన్నారు"** అని కవి అనడంలో ఉద్దేశ్యం- మనిషి తన ఉనికిని కోల్పోయి, నాలుగు గోడల మధ్య బందీ అయ్యాడని. బయట వినిపించే పక్షుల కిలకిలరావాలు మనిషి లేని లోకం ఎంత ప్రశాంతంగా ఉంటుందో చెబితే, లోపల వినిపించే గడియారం టిక్-టిక్ శబ్దం మనిషి మృత్యువు కోసం లెక్కపెడుతున్న క్షణాలను సూచిస్తుందని కవి వర్ణించారు.

కరోనా కాలంలో మనుషుల మధ్య వచ్చిన భౌతిక దూరం, మానసిక దూరంగా ఎలా మారిందో కవి విశ్లేషించారు. "తాకడం" అనేది మనిషికి సహజమైన గుణం. కానీ, ఒక వైరస్ వల్ల కన్నతల్లిని బిడ్డ ముట్టుకోలేకపోయిన, భర్తను భార్య ఆఖరిసారి తాకలేకపోయిన విషాదాన్ని కవి అత్యంత బాధతో రాశారు. అంటరానితనం అనే సామాజిక రుగ్మతను కరోనా కాలపు 'భౌతిక దూరం'తో పోలుస్తూ కవి కొన్ని చోట్ల వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మనిషిని మనిషి అనుమానించే స్థితికి చేరుకున్న దైన్యాన్ని ఇది ఎండగడు తుంది. మరణం సర్వసాధారణమైపోయిన వేళ, శవాల కుప్పల మధ్య మనిషి విలువ ఏమైందో ఈ కవితలు చర్చిస్తాయి. వరుసగా కాలుతున్న చితులు, పేరు తెలియని అస్థికల కుప్పలు చూసినప్పుడు కవికి కలిగిన వేదన ఇది. అధికారం, హోదా, కులం, మతం.. ఏవీ మృత్యువు ముందు నిలబడలేవని కవి గుర్తు చేస్తారు. "చనిపోయిన వాడు మనిషి కాదు, ఒక నంబర్ మాత్రమే" అని వ్యవస్థలు భావించిన విధానాన్ని కవి తీవ్రంగా ఖండించారు. ప్రతి శవం వెనుక ఒక గాథ ఉందని, ఒక కుటుంబం ఉందని ఆయన గుర్తు చేస్తారు. సిధారెడ్డి గారి భాష అత్యంత సరళంగా ఉంటూనే లోతైన అర్థాన్ని ఇస్తుంది. అచ్చమైన తెలంగాణ పదజా లంతో పాటు, కవితాత్మకమైన శైలి పాఠకుడిని ఆలోచిం పజేస్తుంది. ఉదాహరణకు, 'గాలిని బంధించడం', 'నిశ్శబ్దం మాట్లాడటం' వంటి ప్రయోగాలు ఈ సంకలనంలో అద్భుతంగా కుదిరాయి.

ఈ కవితను చదివినప్పుడు మనకు కలిగే భావన ఒక్కటే "అభివృద్ధి అంటే ఆకాశహర్మ్యాలు కాదు, ఆపదలో ఉన్న మనిషికి అందే చేయూత." నందిని సిధారెడ్డి గారు 'అనిమేష' ద్వారా మన కళ్ళను తెరిపించి, సమాజంలోని ఈ చీకటి కోణాన్ని వెలుగులోకి తెచ్చారు. 'అనిమేష - ఉపద్రవగాథ' కేవలం ఒక కాలానికి సంబంధించిన కవిత్వం కాదు.

ఇది రేపటి తరానికి ఒక హెచ్చరిక. మానవీయ సంబంధాలను గౌరవించాలని, ప్రకృతితో మమేకమై జీవించాలని, కష్టకాలంలో ఒకరికొకరు తోడుండాలని ఈ కావ్యం ప్రభోధిస్తుంది. నందిని సిధారెడ్డి గారు ఒక కవిగా తన సామాజిక బాధ్యతను నెరవేరుస్తూ, ఈ ఉపద్రవ కాలాన్ని అక్షరబద్ధం చేసి చరిత్రలో నిలిపివేశారు. తెలంగాణ భాష, సంస్కృతి, ప్రజల జీవన వాస్తవాలు, సామాజిక చైతన్యం ఆయన రచనలు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయి. కవి, రచయిత, ఉపాధ్యాయుడు, వక్త, పరిశోధకుడు అనే అనేక రూపాల్లో ఆయన తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. భవిష్యత్ తరాలు కూడా ఆయన రచనల ద్వారా తెలంగాణ ఆత్మను, తెలుగు భాషా గొప్పతనాన్ని తెలుసుకుంటాయి.

డి. సాయినాథ్ రెడ్డి
6305584064
హైదరాబాద్ విశ్వవిద్యాలయం



(కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించిన సందర్భంగా ఈ వ్యాసం)

నినాదం
నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి
ఆదివారం 29-03-2026

'కవీనాం కవిః' అని అభ్యుదయకవులలో అనదగిన కవి అజంతా. పెనుమర్తి విశ్వనాథశాస్త్రి తన కలంపేరు 'అజంతా' అని పెట్టుకోవడంలోనే విలక్షణమైన ఊహాశిల్పం వ్యక్తమవుతుంది. అజంతా అసలుపేరు పెనుమర్తి విశ్వనాథశాస్త్రి. పశ్చిమగోదావరి జిల్లా కేసనపల్లి గ్రామంలో 2-5-1929లో జన్మించారు. హైదరాబాద్, చెన్నైలలో ఆయా పత్రికలలో పనిచేసారు. 'ఆంధ్రప్రభ'లో చీఫ్ సబ్‌ఎడిటర్‌గా పనిచేశారు. అజంతా కవిత్వ సరిహద్దుల తీరు విభిన్నంగా దర్శనమిస్తుంది. రాజీపడని వ్యక్తిత్వంతో కవిత్వాన్ని తపస్సుగా భావించి అజంతా కలం కదిలించాడు. రాసిన కవిత్వం రాసిలో తక్కువైనా వాసిలో పెను సంచలనాలనే సృష్టించింది. 1997లో అజంతా 'స్వప్నలిపి'కి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు వరించింది. ప్రతి కవిత వస్తుపరంగా, శిల్పపరంగా ప్రతిధ్వనుల్ని సృష్టించింది. అందుకే తెలుగు కవితాప్రస్థానంలో అజంతా స్థానం ప్రత్యేకం, నవీనకాలంలో కవిత్వంలో డిలాన్‌థామస్ ప్రయోగించిన పదచిత్రాల సృజనలోను ఆంగ్ల వాక్యనిర్మాణ విన్యాసంలోను, మృత్యువును దర్శించిన వైనాలు ఆధునికసాహితీ ప్రపంచంలో అత్యున్నతస్థానాన్ని సాధించిపెట్టాయి. అజంతా కూడా డిలాన్‌థామస్ నుండి ఎన్నో నేర్చుకున్నట్లుగా కన్పిస్తాడు. అందుకే అజంతా 'ఆంధ్రాడిలాన్'గా కీర్తించబడ్డారు. భాషని పూర్తిగా పిండుకోవటంలోనే వినూత్నమైన విశిష్ట కవిత్వాన్ని డిలాన్ థామస్ సృష్టించగలిగాడు. డిలాన్ థామస్ కవితా రహస్యాన్ని అజంతా స్వంతం చేసుకొని జీర్ణించుకున్నాడు.

# అజంతా 'స్వప్నలిపి' సహస్రముఖీనత

"అన్నింటికి కారకుడు మనిషి కనుక ప్రతి మనిషిలో నన్ను చూసుకోవడం నాకెంతో ఇష్టం. మనిషి ఎక్కడ ఉన్నా ఒకడే. పృథ్వీ తలంపై మనిషి అడుగులిడినప్పుడు వినపడిన తొలిక్షణం నుంచి, మనిషి అంతరాత్మ ఒక్కటే. నేను ప్రతి మనిషిలో వుంటాను. ప్రతి మనిషి స్వప్నంలో వుంటాను. స్వప్నసౌందర్యంలో వుంటాను. బాధలో, దుఃఖంలో మండుతున్న గాయాలలో వుంటాను. ఎడారిలో, మనిషి ఆక్రందనలో ఉంటాను. అధః పతితుడైన మనిషిని ఆప్యాయంగా లేవనెత్తుతున్న కారుణ్యహస్తాలలో వుంటాను. అక్షరాలకు సంకెళ్లు లేవు, భూగోళంపై సరిహద్దులు లేవు. మనిషి అత్యున్నత పన ఒక్కటే. అతడు మాట్లాడేభాషకు ఆయువుపట్టు. ప్రతి అక్షరం ఒక మనిషి. ప్రతిమనిషి ఒక అక్షరం. మనిషి ఆకృతులవలెనే, మనిషి అవయవ నిర్మాణం వలెనే అక్షరాలకు కూడా ఒక ఆకారం, ఒక భంగిమ, భావానుగుణ్యమైన ఒక కదలిక, ఒక లయ, ఒక విన్యాసం, రంగు, రుచి వుంటాయని నేను విశ్వసిస్తాను. స్వప్నలిపి రహస్యం ఇదే అంటారు అజంతా." దైనందిన జీవనబీభత్సంతో తను చేస్తున్న వివిధ విన్యాసాలనే కొత్తదనపుటల్లుగా కవిత్వసృజన చేశారు అజంతా.

శ్రీశ్రీ, 1972లో నగ్నముని 'ఊరుగాలి' సంకలనానికి స్వాగతవచనం చెప్తూ "శిష్ట్లా, పఠాభి – వాళ్ళిద్దరిలాగే, కొన్ని విషయాలలో ఇద్దరికన్నా మిన్నగా వచనగీతం మీద పరిపూర్ణమైన అధారిటీతో కవిత్వం చెప్పిన వాడు అజంతా" అన్నాడు. నగ్నముని, అజంతా ప్రభావంతో 'ఉదయించని ఉదయాలు' రచించారు. ఆ ప్రభావానికి ఎంతోమంది కలం కదిలించారు. దూరదృష్టి కలిగిన కవి, తన కవిత్వ ప్రభావంతో తరాల్ని ప్రభావిత చేయగలడు. బలమైన వాక్కుతో ప్రతిధ్వనుల్ని సృష్టించగలడు. ఎంతైనా అక్షరాన్ని అతిజాగ్రత్తగా చెక్కడంతో అజంతా అందెవేసిన చెయ్యి.

నిర్జీవమైన పదాలను కూడా సజీవ సౌందర్యచిత్రాలుగా రూపొందించడం కవి విలక్షణ ప్రతిభపై ఆధారపడి ఉంది. భావం ఎంత విశిష్టమైనదైనా భాషలో కొత్త పదాలు చూపలేకపోయినప్పుడు కవిత నేల మీద మాత్రమే ఉంటుంది. ఆకాశమంత ఎత్తు ఎగరలేదు. కవే ఎగరలేనప్పుడు పాఠకులను ఏ ఎత్తులకు తీసుకెళ్ళగలడు? ఈ రహస్యం డిలాన్ థామస్‌కి తెలుసు; అజంతాకి తెలుసు. అజంతా దృష్టి ప్రధానంగా భావం మీద కంటే, శిల్పం మీదే ఎక్కువ దృష్టి కేంద్రీకరించినట్లు కన్పిస్తుంది. ఉలితో శిల్పాన్ని చెక్కే శిల్పికి ఉండేంతటి ఏకాగ్రత శిల్పదృష్టిని పరిశీలిస్తే శ్రీశ్రీ, తిలక్‌ల తర్వాత అజంతానే ప్రముఖంగా కన్పిస్తాడు. రాసిన ప్రతి అక్షరంలో మహాశక్తిని నిక్షిప్తం చేసి, అక్షరశతఘ్నులు పేల్చి సమకాలీన కవుల్నిసైతం ప్రభావితం చేసిన ప్రఖ్యాతకవి అజంతా.

స్వప్నసహవాసి

కవిత్వం ఒక స్వప్నక్రియ. జన్మతః స్వప్న విద్య అలవరచుకున్న కవి అజంతా. స్వప్నసహవాసి అజంతా కవిత్వాన్ని 'స్వప్నలిపి'గా భావించాడు. 'కవిత్వం ఒక ఆల్కెమి' అన్నాడు తిలక్. అజంతా తాను రాస్తున్న కవిత్వం ఇంకా లిట్మస్ టెస్ట్ దాటలేదంటాడు. అజంతా తాను శోధన నాళికలలో జీవిస్తున్నాను. అర్ధసత్యాలతో జీవిస్తున్నాను. భిన్న, విభిన్న రసాయన చ్ఛాయలలో జీవిస్తున్నాను. భ్రమ, విభ్రమాలలో బ్రతుకుతున్నాను. పరిస్థితులను గమనిస్తుంటే ఒకవైపు భయంకరమైన వాస్తవం కాలావధులకు అతీతంగా కలలపై పరిభ్రమిస్తున్న నైరూప్య ప్రపంచం మరొకవైపు; నా అన్వేషణ ఇక్కడే ప్రారంభమైందంటాడు అజంతా. "మనిషి సహజంగానే స్వాప్నికుడు. మనిషిలో అంతర్భూతమై వున్న స్వప్నశక్తిని, స్వప్నశక్తి సార్వభౌమాధికారాన్ని వినిర్గతం చేయడం ద్వారా ఆశిస్తున్న కొత్త ప్రపంచాన్ని ఆవిష్కృతం చేయగలగానన్నదే అజంతా తన కవిత్వపంథాగా చెప్పుకున్నాడు. కవిత్వమే జీవితంగా జీవించాడు, అందుకోసమే కవిత్వం రాసాడు. "అక్షరం తర్వాత మరో అక్షరం. చీకటి అవయవాలపై తెల్లని అక్షరాలు. ఒక అక్షరాన్ని చుట్టుకొని ఎన్నో అక్షరాలు. వాక్యం తరువాత మరోవాక్యం. అంతా ఒక 'చిత్కళ'. చిత్రవిచిత్ర వాక్యసముదాయం. నేను అక్కడే వుంటాను. అక్షరం విచ్చుకుని స్వప్నధూళిలో ఆవిర్భవించిన కొత్త అక్షరంలో నేను వుంటాను". ఇదే 'స్వప్నలిపి'గా పేర్కొన్నాడు. వర్తమాన జీవితం అగమ్యం, అస్పష్టం, అగోచరం, అర్థరహితంగా ఉందంటారు. అజేయంగా వున్నదల్లా స్వప్నశక్తి సార్వభౌమాధికారం ఒక్కటే. అది అప్రతిహతం అంటారు.

కవి అన్నవాడు ప్రపంచాన్ని చూడాలే తప్ప, తానై ప్రపంచానికి కనపడకూడదు అన్నది అజంతా భావన. అందుకే కవిత్వం ఒక రహస్యక్రీడగా, మర్మక్రీడ భావించాడు. చీకట్లో ఉన్నవాడే జీవనరేఖపై అఖండ దీపాన్ని స్పష్టంగా చూడగలడని అజంతా నమ్మకం.

*"నా నివాసం ఎక్కడో శూన్యంలో చీకటి*
*నిపాషాణాలపై స్వప్నశృంఖలాలలో కావచ్చుగాక*
*కాని, శూన్యంలో చీకటి ప్రజ్వలనం నేను చూశాను.*
*చీకటి ప్రజ్వలనంలో నిర్జీవప్రతిమ ఖడ్గనాట్యం చూశాను*
*నేను సజీవంగానే ఉన్నానా?*
*అశ్రుదగ్ధమైన నీడలలో నా ప్రతిధ్వని*
*మళ్లీ ఎప్పుడు వినగలనో మరి"*

చీకట్లో ఉన్న మనిషి జనన మరణ రహస్యాన్ని ఎలా ఆవిష్కృతం చేయగలడో అజంతా 'చీకటి చిత్రశాల' కవిత ద్వారా ఆవిష్కరించాడు. మృత్యువు సంభవించడం హఠాత్ సంఘటన కాదు. అది ఒక పరిణామం అన్న భావాన్ని స్పష్టం చేశాడు. 'మనిషి' ఉన్నాడు కాబట్టి మరణం అనేది ఒకటుంది అంటాడు. "భయ, విభ్రమాల మధ్య విషాదవాక్యం వలె సాగె జీవితంలో మృత్యువు ఒక్కటే నిజం అన్నది ఒక హెచ్చరిక కాదా అంటాడు. మృత్యువు శారీరకం కాదు. క్షణక్షణ జీవితం, క్షణక్షణ మృత్యువు, నేను ఇంకా సజీవంగానే ఉన్నానన్న విషయం నిర్ధారించు కోవడానికి నా మృత్యువును నేనే అనేకసార్లు నడివీధిలో చూశానంటారు. చూడక తప్పదంటారు. మృత్యువు కూడా జీవితమేనంటారు. మనం ప్రస్తుతం జీవిస్తున్నది మృత్యుచ్ఛాయలలోనే కదా. ఆశ, నిరాశ వేరు వేరు కావు, జనన, మరణాలు వేరు వేరు కావు, మరణ రహస్యం ఇప్పుడు రహస్యం కానేకాదంటారు. శిరస్సు తెగిన దీపస్తంభం మృత్యువు" అన్న వాక్యాన్ని కిరీటంగా ధరిస్తానంటాడు.

మనిషి సమాధి పక్కనే మనిషి పుట్టుక. అంతా ఒకే వృత్తం. అంతా ఒకే లిపి అంటారు. వాస్తవం చేదు విషం కాబట్టి గరళకంఠుడైన కవి ఒక్కడే ఉద్భవిస్తాడంటారు. కవిత్వం సహస్రముఖి. కవిత్వం ఒక ఎడతెగని ప్రవాహం అనుకుంటే ప్రవాహజలం ఎక్కడైనా, ఎప్పుడైనా ఒకటే. హృదయాన్ని చీల్చుకుని వచ్చే అక్షరాలకు రసాయన దోషం అంటదంటారు. కాలానుగుణ్యమైన భాష ఆర్కిటెక్చర్ కవిత్వానికి అత్యంత ప్రాధాన్యం అని నా కవిత్వానికి కూడా ప్రాణవాయువులవే అంటాడు. ముక్త కవిత్వానికి గౌరవప్రదమైన స్థానం కల్పించాలన్నదే తన లక్ష్యం అంటారు. అజంతా రాసిన పద్యాలు బహుశా నలభై పైగానే ఉండొచ్చు. ఇవన్నీ 1948 నుండి 1992 మధ్య కాలంలో రాసినవే. రాసిన పద్యాలన్నీ స్మృతిపీఠం ముందు కూర్చుని రాసినవే. రాసి సమాజలోకం మీద ఆరవేయడం వరకే నాపని అంటారు. 'పెర్ఫెక్షన్' నా లక్ష్యం అంటాడు. దీన్నే 'క్రిస్టలైజేషన్' అని కూడా అనవచ్చు. అది ఎంతవరకు నెరవేర్చగలిగానో శేషజీవితంలో సాధ్యమవుతుందో లేదో అనే నిరంతర ధ్యానంతోనే పద్యాలు రాసారు.

నిరాశావాదం అజంతా కవిత్వంలో నిరాశామయ మానసికావస్థ స్పష్టంగా గోచరిస్తోంది. *"ఉరిత్రాళ్ళు నా ఊహలు / సంకెళ్ళు నా మాటలు / నాపై రువ్విన రాళ్ళు నా అక్షరాలు"* అంటాడు. పై వాక్యాలను పరిశీలిస్తే ఎంతటి నిరాశానిస్పృహలు, బాధాతప్త హృదయంతో ఆవేదనతో కవిత్వసృజన చేస్తున్నాడో తెలుస్తుంది. ఊహకందని భావాలు తారసపడతాయి. అజంతా కవిత్వంలో ఏ కవికైనా ఊహలు, ఆనందం, బాధనో కల్గించొచ్చు కాని ఏకంగా ఉరిత్రాళ్ళను ఊహలుగా కలిగిన వ్యక్తి మనసు ఎలా ఉంటుందో ఊహకందని విషయం, ఆ మాటలను సంకెళ్ళుగా భావించడం, తనపై రువ్వినరాళ్ళను అక్షరాలుగా భావించడంలో కవి అవ్యక్తవేదనామయ స్వరూపానికి అక్షర రూపంగా భావించవచ్చు. పైగా రూపం లేదు, "నా రూపం నా గీతం" అంటూ గీత స్వరూపాన్ని స్పష్టం చేశాడు. అజంతా అధివాస్తవికత నీటిమీద తెప్పలా పైకి తేలుతూనే ఉంటుంది.

*"నాకు నిలయం లేదు*
*నాకు విలయం లేదు*
*అశాంతిని ఆక్రమిస్తాను*
*అడవిలో వెన్నెలను దుస్తులుగా ధరిస్తాను*
*అర్ధరాత్రి బీభత్సం మేలుకొనేటప్పుడు*
*శూన్యం మీద శూన్యంగా కూర్చుని*
*రాలుతున్న నక్షత్రాల మీద నా గీతం రచిస్తాను*
*ఆకాశం కనబడని చోట*
*చీకటి ఉరికంబంలా నిలబడిన చోట*
*నిశ్శబ్దం మీద నిశ్శబ్దంగా కూర్చుని*
*రాలుతున్న నక్షత్రాల మీద నా గీతం రచిస్తాను"*

అంటారు. 'నాపై రువ్విన రాళ్ళు నా అక్షరాలు' అనే కవితలో. ప్రతి ఆలోచనలో, భావనలో, తలపులో తారాస్థాయి విషాదాన్ని ప్రతిభావంతంగా ప్రకటించాడు.

సంక్షుభిత మానవ సమాజంలో తారసపడే సంక్లిష్టమనస్తత్వాలు, రాజకీయ చదరంగంలో క్రుంగికుశించి పోతున్న మానవీయవిలువలు, సమాజంలో రకరకాలుగా సంచలనమవుతున్న మృత్యుబీభత్సం మొదలైన భావాలు పదునైన పదాలతో అజంతా కవిత్వం సాక్షాత్కరిస్తుంది. తొలినాళ్ళలో రాసిన కవిత్వానికి పరిణామక్రమంలో ప్రభవిల్లిన కవిత్వానికి ఎంతో వైవిధ్యముంది. 'కవి' తన కవిత్వంలో తాను దొరుకుతాడు. కవిత్వంలో తన జీవితం ప్రతిఫలిస్తుంటుంది. అంతర్ముఖీనుడైన అజంతా తన కవిత్వంలో మానవ హృదయ సంక్షోభం అంతా కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు.

సమాజంలో ఎన్నో విపరీత విపత్కర పరిస్థితులను చవిచూసిన అజంతా తన కవిత్వంలో మానవతావాద దృక్పథాన్ని కొన్ని కవితల్లో ఆవిష్కరించారు. *"ఆశలేదు, ఆస్కారంలేదు/ఫలానా రోడ్డు గమ్యం చేరుస్తుందనే సూచన ఎక్కడా లేదు/జీవితం ఎప్పుడూ ఇలా కన్నీళ్ళ ప్రవాహంగానే సాగుతుందనుకుంటాను/ రోడ్డు పొడుగునా చెట్లు కూలుతున్న దృశ్యాలనే చూపుతుందనుకుంటాను/ లేకుంటే ఎంతో అందమైన సాయంత్రం కదా ఇలా అపస్వరాలు వినపడడం జరగదు/* రోడ్ల మీద ధూళి, దారిద్ర్యం సమస్తం మిత్రుడు వెంకట్రావు ముఖం మీదనే పరవళ్ళు తొక్కడం జరగదు అంటూ నిరుద్యోగి వెంకట్రావు జీవితంలో చెట్లుకూలుతున్న దృశ్యాల గురించి హృదయ విదారకంగా కవితాచిత్రణ చేస్తాడు. నిరుద్యోగి వెంకట్రావును గురించి చదువుతుంటే తిలక్ 'అమృతం కురిసిన సంకలనంలో 'సి.ఐ.డి. రిపోర్ట్' కవితలో 'గుమాస్తా సుబ్బారావు పాత్ర కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది. అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చేసే కవిత్వ విధానం అజంతాది. సామాన్యుని వేదనను ఆవేదనగా నివేదించడంలో అజంతాది అందెవేసిన చెయ్యి.

*"తలక్రిందులైన స్వప్నం మీద శల్యాకారంగా కూర్చున్న కుర్రవాడు / ఆపాదమస్తకం సూదులతో ముస్తాబై ఉన్నవాడు / అతని ముఖం నిండా స్ఫోటకం మచ్చలు / కళ్లలో శిలావిగ్రహాల వీక్షణలు /* అతని చుట్టూ పరాజయభారంతో క్రుంగుతున్న వృక్షాలు అంటూ నిరుద్యోగి వెంకట్రావుని వర్ణిస్తూ మనముందు నిలబెడతాడు.

వెంకట్రావు ప్రస్తుతం ఆకాశం క్రిందనే నివాసం ఉంటున్నాడని, నగరం నడివీధిలో తన జీవితాన్ని ఆవిష్కరిస్తుంటే అకారణంగానే సూర్యుడు ఖిన్నుడౌతాడని, చెట్లమీద ఆకుసైతం అల్లల్లాడదని, టెలిఫోన్ తీగలలో వార్తాప్రసారం సాగదంటాడు. నగరం గుండెలలో నిరుద్యోగి వెంకట్రావు సాలీడులా అల్లుకుంటూ ఉంటే ప్రభుత్వ భవనాలలో ఎవరికీ ఒక క్షణంపాటు ఊపిరి ఆడదని, కలం, కాగితం పట్టుకున్న అధికారి తనంత తానే రాజీనామా పత్రం మీద సంతకం పెడతాడని, ప్రభుత్వ భవనాల మీద జెండా సిగ్గుతో తలవాల్చుకోవచ్చుంటాడు. తన ఆకలిని రాళ్ళలో రప్పలలో దాచుకుంటూ ఉంటే రాజకీయవేత్తలు వాటిని వేలంపాటలో కొనుక్కుంటారంటాడు. ఇంతటి దయానకమైన పరిస్థితులను హృదయవిదారకంగా వర్ణించాడు. విషాదం రంగు ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి, కవులు, చిత్రకారులు, వెంకట్రావు కన్నీళ్ళపై పరిశోధనలు చేస్తారు అని వ్యంగ్యంగా పలికి, అతని పాదధూళిలో చీకటి పుట్టుపూర్వోత్తరాలు వెతుకుతారంటాడు.

జీవితంలో 'నిరుద్యోగిత్వం' అనేది ఎంత భయంకర అవస్థో కవిత్వం ద్వారా దృశ్యీకరించాడు. *"బాధ అనే దీపం పట్టుకుని / సర్వనాశనం అనే తాళంచెవిని పట్టుకుని / వెంకట్రావు జీవితం అనే చీకటి నరకకూపంలో ఎన్నో భయంకరమైన ఆశ్చర్యాలు చూడొచ్చు"* అంటాడు. జీవితం మీద నమ్మకం ఉన్నవాడు వెంటనే అక్కడే ఊరిపోసుకొని చావడం సంభవం కావచ్చు అంటాడు. అంటే సమాజంలో నిరుద్యోగవ్యవస్థ వల్ల వెంకట్రావులాంటి ఎందరో వ్యక్తులు ఎంతటి దుర్భర పరిస్థితులు చవిచూస్తున్నారో వ్యక్తమవుతుంది. అయితే *"నిరుద్యోగి వెంకట్రావు ఎన్నటికీ చావడు / అందుకే అందమైన సాయంత్రంవేళ నగరం అంతటా అపస్వరాలు / వెంకట్రావు నడుస్తున్నంత మేరా చెట్లు కూలుతున్న దృశ్యాలు"* అన్న ముగింపు ప్రతిపాఠకుణ్ణి కదిలిస్తుంది.

అజంతా రచనలు తిరిగి మరో విధంగా తాత్పర్యార్థాన్ని చెప్పడానికి వీలయ్యేవి కావు. ఆధునికులు మంచి కవిత్వానికి ఇదొక లక్షణం అంటారు. వ్యక్తి చైతన్యం ఆధునిక నాగరికతలో సాంప్రదాయిక సమాజంలో లాగా అందరితోటి, ప్రకృతితోటి, అన్నింటితోటి సమస్థితిలో ఉండదు. ఈ ఆధునిక స్థితిలో ఒంటరిగా భావించే వ్యక్తి దారిలేనిచోట దారిని వెతకడం ప్రారంభిస్తాడు. గాలిలేని చోట ఊపిరి కోసం తపన పడుతుంటాడు. ఇలాంటి స్థితిగతుల్ని పునః ప్రవచించిన మార్గం అజంతాది. అంతర్ముఖత్వం ద్వారా దీన్ని సాధించారు. ఆధునిక కవిత్వంతో ఇది కాలుష్యయుగం అని ప్రకటించాడు అజంతా. ముప్ఫైఏళ్ళ క్రితం ఒకసారి సాహిత్యంలో సాహిత్యేతర విషయాలు కలిసిపోయాయని నొచ్చుకున్నాడు. కవిత్వంలో సిద్ధాంతాలు, విశ్వాసాలు ఉండకూడదన్నాడు. అనుకరణం కూడా కాలుష్యానికి దోహదకారంటాడు. మనస్సులో పుట్టిన కదలికలూ, మాటలూ మాత్రమే కవితాసంపద అయిన పరిస్థితిలో అనివార్యంగా ఏర్పడే కవితాసిద్ధాంతమిదేనంటాడు. అజంతా రాసిన వచన పద్యాల్లో ప్రధానంగా కనిపించే అంశం 'మృత్యువు' భాషాపరంగా, భావాలపరంగా, మనుష్యులపరంగా మృత్యువుతో పాటు చివరకు తన సొంతచావు ఇలా అనేక రకాలు మృత్యువుకి సంబంధించిన అంశాలు అజంతా కవిత్వంలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

ఎవడో హఠాత్తుగా ఘోరప్రమాదంలో చిక్కుకుంటాడనుకో, చుట్టూ పోగైన జనం ఒక్క దఫా నా ముఖంవైపు చూస్తారు. ఇదేం విచిత్రం వీడు, వాడు ఒకే పోలిక అని ఆశ్చర్యపోతారంటాడు. అందాకా ఎందుకు, రోడ్డు మీద నా మృతకళేబరాలని నేనే లక్షసార్లు చూశానంటాడు. నమ్ముతావో నమ్మవో గాని తమ్ముడూ నిజం చెప్తున్నాను అని "ఈ నగరంలో అడుగుపెట్టిన రోజున పట్టపగలు నక్షత్రాలు చూశాను అంటాడు అజంతా. ఈ మృత్యువు ప్రపంచం అంతటా వ్యాపించి వున్నది. ఆధునిక నాగరికతలో వ్యాప్తమై వున్న ఈ మృత్యు లక్షణం భాషకి కూడా వర్తిస్తుందంటాడు.

*"నేను మాట్లాడే భాషవేరు*
*మృత్యువాంఛ ప్రజ్వరిల్లుతున్న*
*వేళ మనిషి అంతరాంతరాలలో*
*రహస్యద్వారాలు నోరు తెరుస్తున్న హోరు*
*నేను రాసే కవిత్వం వేరు*
*శిరస్సు బ్రద్దలై ప్రవహిస్తున్న సెలయేరు"* గా అభివర్ణించుకున్నాడు. అక్షరహింస కవిత్వం కాదంటాడు. "అక్షరహర్మ్యాలతో ప్రచ్ఛన్న రాక్షసులకు దూరంగా రోడ్ల మీద నడుస్తూనే నేను కవిత్వం వ్రాస్తున్నానంటాడు. రోడ్లు నా ప్రాణం. నేను అన్వేషిస్తున్న రహస్య జగత్తు రక్తనాళాలు రోడ్లు అని, రోడ్లు నా రహస్య సంకేతాలంటాడు. రోడ్ల భుజస్కంధాలపై స్వేదబిందువులలో నీ ప్రతిబింబం ఒకసారి చూసుకోమంటాడు. *"రోడ్లు నా జీవనా వ్యాకరణం/నడుస్తున్న ప్రతిమనిషి నన్ను ప్రతిబింబిస్తున్న వాడే/ఒకే భాష, ఒకే ఘోష, ఒకే ఆకారం/*ఒకే ఆత్మకథ అంటాడు.

రోడ్లు నా సర్వస్వం, రోడ్లు నా ఇతివృత్తం, రోడ్లు నా ఛందస్సు, రోడ్లు నా నిఘంటువు, నా అక్షర ప్రపంచం అదే అంటాడు. '

*'నా చుట్టూరా మనుష్యులు/మనుష్యులను కబళిస్తున్న మనుష్యులు/ సుఖదుఃఖాల మధ్య నిర్లిప్తంగా నడుస్తున్న మనుష్యులు/ అరచేతులలో ఎడారులను మోసుకొని వస్తున్న మనుష్యులు/శిక్షా వాక్యాలవలె నిలబడిన భవనాలలో మనిషి భవిష్యత్తును/ఉరితీస్తున్న మనుష్యులు కన్నీళ్ల వలె మెరుస్తున్న మనుష్యులు / రగులుతున్న గాయం నుంచి నెత్తురు చుక్కలవలె రాలుతున్న మనుష్యులు / అంతా నన్ను చీల్చుకుని వస్తున్నవాళ్లే/నా కన్నుల వెనుక రహస్య జలపాతా లను ఛేదించుకొని / వస్తున్నవాళ్ళే"* అంటాడు. అన్నింటికి కారణం మనుషులే అని, కన్నీళ్లకు కారణం మనుషులే అంటాడు. మానవ హృదయాల అంతశ్చైతన్యాన్ని, భావచిత్రాలలో పట్టుకోగలిగిన ప్రతిభావంతుడు అజంతా.


*"నేనెవరో తెలుసా / నాపై విషాదమేఘాలు రువ్వుతున్న వారెవరో తెలుసా / నన్ను వాగ్బంధనం చేస్తున్న వారెవరో తెలుసా/ నన్ను రహోబిలంలో పడద్రోస్తున్న వారెవరో తెలుసా / నా మస్తిష్కాన్ని కాటువేస్తున్న వారెవరో తెలుసా / జీవన సౌరభాన్ని నడివీధిలో వేలం వేస్తున్న వారెవరో తెలుసా / మేఘచ్ఛిన్నమైన ఆకాశం క్రింద రోడ్ల పొడవునా/ శిథిల వృక్షాలకు నమస్కారం చేస్తున్న పరివ్రాజకుడా / విధ్వంసక యంత్రాలను ఆలింగనం చేసుకుంటున్న సాహసికుడా/నీ చేతులను నీవే ఉరిత్రాళ్లుగా మార్చుకుంటున్న వాడా/నీవు మరెవరో కాదు నేనే/ నన్ను వెంటాడుతున్న దారుణ మారణజ్వాలా హస్తాలను హతమార్చగలనా నేను/ మనిషి నిర్మిస్తున్న రాక్షస నగరంలో అతడే కాదు నేను కూడా ఒక ఖైదీనే / న్యాయపీఠాల మధ్య విషభాండంలో మనిషి పాదాలక్రింద పాపభూయిష్ఠమైన భస్మరాసులలో/ నేను కూడా ఉన్నాను? అంటాడు 'రోడ్లకు నమస్కారం' కవితలో. ఇలా రోడ్లను ఇతివృత్తంగా చేసుకొని చీకటి హాలాహలాన్ని ఆస్వాదిస్తున్న వీధిమహర్షిని కావ్యనాయకుడిగా చేసుకొని వచన పద్యాలు రాశాడు. "భయవిభ్రమాల మధ్య విషాద వాక్యం వలె సాగే జీవితంలో / మృత్యువు ఒక్కటే నిజం" అని పేర్కొని, శిరస్సు తెగిన దీపస్తంభం మృత్యువంటాడు. "జీవన" సంగ్రామంలో క్షణం ఆలస్యంగా అడుగుపెట్టిన నేను/చెట్ల ఆకులలో బీభత్సం చూశాను"* అంటాడు. మనిషి ఆ ఆలోచనలపై చీకటి అంగరక్షకుల పాషాణ హస్తాలు చూశానంటాడు. నిషిద్ధాక్షరాల మధ్య నరబలి చూశానంటాడు. ఎర్రని గాయాలపై సూర్యకిరణాల చిత్రలిపి చూశానంటాడు. బాధను ముఖచిత్రంగా చేసుకొని రాస్తేనే నా అక్షరాలకు నిషా అంటాడు 'అగ్నిస్పర్శ' కవితలో. "నిగూఢమైన ఒక శబ్దం వెనుక అగాధం లోలోతులలో అజంతా తన పద్యాలు ఈది, ఎక్కడో ఒక ఒడ్డుకు చేరుకున్నప్పుడు అక్షరం నిండా అన్నీ అద్భుతాలే అంటాడు 'అంతా ఒకే శబ్దం' కవితలో. మృత్యువు ఒక హెచ్చరిక మాత్రమే అని ఆకురాలుతున్న శబ్దం ఒక ఆహ్వానం మాత్రమే అని మరణానంతరం కూడా మనిషి మాట్లాడుతూనే ఉంటాడంటాడు. *"శరీరాన్ని జయించిన ఒక జీవితం అట్టడుగున/శబ్దపేటిలో ఒక అస్థిక వికసిస్తున్న శబ్దం నేనే/* అంతా ఒక చిత్‌కళ అని అంతా ఒకే శబ్దం, ఒకే కదలిక, ఒకే ప్రవహ్లిక అంటాడు.

ఆశలు లేవు, అసూయలు లేవు, నిరాశలు లేవు, నిట్టూర్పులు లేవు, ద్వేషాలు లేవు, దురాగతాలు లేవు, కష్టాలు లేవు, కన్నీళ్ళు లేవు, అంతటా ఒకే ఒక నిశ్శబ్దం, ఒకే ఒక హృదయ స్పందన అంటాడు. "గుడిసెలో వెన్నెట్లో కార్మికులు కన్నీళ్లు ఆరబెట్టుకున్నారు. కటకటాల మధ్య శూన్యంలో ఖైదీలు ఆకాశయానం చేస్తున్నారు. పేవ్‌మెంట్ మీద భిక్షకులు వాల్‌పోస్టర్లు కప్పుకున్నారు. ఎక్కడా ఎవరూ లేరు అంతా ఇళ్ళు చేరుకున్నారు అంటారు 'సుషుప్తి' కవితలో. సుషుప్తి బాధలకు పరిష్కారం కాదు. కాని బాధల్ని మరిపించే సుషుప్తి ఎంత గొప్పది అనే భావన స్ఫురిస్తుంది. ఈ రాత్రి ఆలోచనల తోడేళ్ళు ఎవర్నీ వెంటాడవు. ఇప్పుడు జీవితమనే పెద్దపులి ఎవర్నీ భయపెట్టదు. ఎక్కడా ఎవరూ లేరు, అంతా నిద్రపోతూ చీకటి శరణాలయంలో అంతా తలదాచుకున్నారంటాడు.

చైనా భారతదేశంపై యుద్ధానికి దిగినప్పుడు అజంతా మార్క్సిస్టు పంథాను ఆక్షేపించారు. *"చైనా అధినేత మావో / కనుబొమ్మల కొమ్మలపై ఘృతేళికలు మరీ మరీ ఎరుపు / ఎర్రదనం రాజకీయ విద్రోహానికి గుర్తు" ఎర్రజండా మిత్ర భేదానికి గుర్తు"* అంటాడు అజంతా.

మానవతావాదం

అజంతా 'పరిత్యాగి పరివేదన' కవితలో మాత్రమే మధ్యతరగతి మనిషి సొంత బాధని ఎంతో ఆర్తితో జాలిగా వ్యక్తం చేస్తాడు. "తమ్ముడు కులాసాగా ఉన్నావా/పోనీ నీవైనా పుస్తకాల పూజ చేస్తున్నావా? అమ్మనీ, నాన్ననీ హింస పెట్టకుండా/వాళ్లు కన్నీరై ప్రవహించకుండా/పోనీ నీవైనా కుటుంబానికి పేరు తెస్తున్నావా అని అడుగుతాడు. ఇంతలోనే ఎన్నో ఉగాదులు వచ్చి వెళ్ళాయో, ఇప్పటికి అడుగడుగునా ఎన్ని గండాలు గడిచాయో చెప్పలేనంటాడు. "ఎప్పుడు ఏ క్షణం ఆకాశం నా మీద విరుచుకుపడుతుందో/ ఎప్పుడు ఏ రోజు ఎలక్ట్రిక్ స్తంభం నా మెడకు చుట్టుకుంటుందో/ ప్రస్తుతానికి మాత్రం ఈ చిన్నసైజు నరకంలో కులాసాగానే ఉన్నాను" అంటాడు. "నీకు ఎంతో దూరంగా ఎక్కడో సమానాంతరరేఖపై నిలబడిన నేను/ నన్ను నేనే పోల్చుకోలేక నాకు నేనే సహస్ర యోజనాల దూరంలో "ఉన్నానంటాడు. అద్దంలో తన ముఖంను చూడటానికే భయమంటాడు. తన సంతకంలో అక్షరాలు చూస్తేనే చెప్పలేనంత భయం అంటాడు. "నా చూపుడువేలు నిత్యం భయాలవైపే ఉంటుందనడంలో తన మానసిక స్థితి; ఆందోళన వ్యక్తమవుతుంది. రోడ్డుమీద నా మృతకళేబరాలను నేనే లక్షసార్లు చూశానంటాడు. ఎటుచూసినా పద్మవ్యూహమే అని, చూస్తూ చూస్తుండగానే మనిషిని మటుమాయం చేసే మనుషులున్నారని, అంతా ఒక మహామాయా ప్రపంచం కళ్ళముందు గోచరిస్తుందంటాడు. జీవితం నిండా శూన్యమే ఆవరించిందంటాడు.




తమ్ముడూ పదేళ్ళయినా వయసు లేనివాళ్ళలో ఒక రోజు సాయంత్రం అమ్మ నాన్నని కన్నీళ్ళు పెట్టించాను. క్రమ్ముకువస్తున్న చీకట్లలో కన్నీళ్లు రాల్చుతూ నువ్వే మా కష్టాలకు వంతెనన్నారు. వాళ్ళ ఆశని మొక్కగా ఉన్నప్పుడే త్రుంచేశాను. వాళ్ళను అక్షరాలా కన్నీరుగా మార్చేశానంటాడు. "ఇంద్రధనుస్సుల సౌందర్యాన్ని ఆరాధిస్తూనే/అసత్యాల అరణ్యంలో చిక్కుకుపోయాను/ గగన కుసుమ సౌరభం క్రింద స్పృహతప్పి పడిపోయాను".

ఇలా బాధను జాజ్వల్యమానంగా వెలిగొందుతూ తన కథ సహస్రాక్షరాల దూరం సాగుతుందంటారు. ఏనాటికైనా మంచిరోజులు రాకపోతాయా అనే ఆశ తనలో కనిపిస్తుంది. తన తమ్ముడిని ఈ ఆశనే తల్లిదండ్రులకు చూపించి చల్లని హస్తాలతో తనను దీవించమంటాడు. ఇవి కేవలం అజంతా వ్యక్తిగతమైన కన్నీటి మాటలు కావు. నిరంతర ఆత్మహననంలోంచి ఉద్భవించిన పదునైన భావాలుగా భావించాలి. ఇలా మన అంతరంగాలను తనలో సృష్టించుకొని అక్షర సృజనచేసిన కవి అజంతా. అజంతా కవిత్వం నిండా మనిషి భయాల్ని వెంటాడుతున్న కలలు; దృశ్యం తరువాత దృశ్యంగా మారిపోతుండడాన్ని గమనించవచ్చు. వాస్తవ ప్రపంచాన్ని గాక కాలావధులకు అతీతంగా కలలపై పరిభ్రమిస్తున్న నైరూప్య ప్రపంచాన్ని అవిష్కరించటమే కవిత్వం చేయాల్సిన పని" అంటాడు అజంతా.

జీవన వ్యూహంలో మహాసర్పం వలె ప్రవేశించిన ప్రచండమైన ఆలోచన వెనుక అన్నీ ప్రశ్నలే అని కదా" అని సమాజం ప్రశ్నిస్తుందన్నట్లుగా ప్రశ్నించుకొని తానే మహాసర్పాలు మాట్లాడవు, మహావృక్షాలు మాట్లాడవు అంటాడు. "స్వప్నావధులకు అతీతంగా ఊర్ధ్వరేఖపై ఒకే ఒక ఉజ్జ్వలనేత్రం నిశ్చలం, నిశ్చలం అంటాడు 'అనామిక కవితలో. ఇప్పుడిక ద్రవిస్తున్న గడియారాలతో నిమిత్తం లేదని జీవన సంఘర్షణలో ఉజ్జ్వలమైన క్షణం ఒక్కటే అంటాడు. 'నగ్నాక్షరం కూడా ఒక ఆయుధమేనంటాడు.

*"నిజం గ్రహిస్తు న్నాను; వాస్తవం వెనుక అధివాస్తవంలో మనిషి ముఖం మీద స్వప్నలిపి చూస్తున్నాను"అంటాడు. స్వప్నశక్తి విజృంభణలో సంకెళ్ళు తెగుతున్న చప్పుడు వింటున్నానంటాడు. చీకటి నిబర్హణం తర్వాతనే కదా కొత్త సృష్టి కొత్త ప్రపంచం"* అంటూ 'స్వప్నలిపి' కవితలో భాష్యం చెప్తాడు. మృత్యువు అంటే మరో జీవన ద్వారం తెరచుకోవడమేనా అని ప్రశ్నిస్తాడు. అక్షరాలకు రెండు జీవితాలు లేవంటాడు. అప్పుడే పుట్టిన ఒక శిశువు శరీరంలో ప్రవేశిస్తేనే తప్ప లేదా ఒక వీధిమనిషి శరీరాన్ని ఆశ్రయిస్తేనే తప్ప అక్షరాలకు మరో జీవితం లేదంటాడు. ఇలా సుదీర్ఘంగా సాగుతున్న కవితాప్రస్థానంలో ఒకవైపు అగ్ని; మరోవైపు జలపాతం దర్శనమిస్తాయి. ఒక అశాంతిలోంచి వచ్చిన శంఖారావం అజంతా కవిత్వం. అజంతా కవిత్వాన్ని పరిశీలిస్తే ఋజుస్వ భావిగా కన్పిస్తారు. తెల్లని చీకటిలో నల్లని మెరుపు అజంతా. వీధి మానిసిని కావ్యనాయకుణ్ణి చేసుకుని, అతనికి నేనున్నానని, అభయహస్తమిచ్చిన స్నేహశీలి, అభ్యుదయ కవి అజంతా. ఇలా ఎన్నో భావాలు అజంతా కవిత్వంలో సహస్రముఖీనంగా వేర్వేరు కోణాల్లో వ్యక్తం చేయబడ్డాయి. అందుకే సహస్రముఖీన స్నేహశీలి అజంతా.



డా॥ పి. విజయకుమార్
అసోసియేట్ ప్రొఫెసర్,
తెలుగుశాఖ,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాద్ -500 046
ఫోన్: 90637 02546